

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028


**భారత్ అరుదైన ఘనత..**

ఖండాంతర క్షిపణులనూ అడ్డుకునే సామర్థ్యం!




Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 165 పేజీలు - 08 వెల - 05/- ఆదివారం 14-06-2026


## తుని బాలిక అదృశ్యం ఘటనపై పవన్ కల్యాణ్ ఆరా... ఆధారం

# అనుకున్న పెంపుడు కుక్క మృతి



- వారం రోజులు గడిచినా ఆచూకీ లభించకపోవడంతో తీవ్రత పెంచాలని ఆదేశం
- గాలింపు చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాల సేవలు వినియోగించుకోవాలని సూచన
- ఇప్పటికే 400 మంది సిబ్బందితో గాలిస్తున్నట్టు పవన్‌కు వివరించిన ఎస్పీ
- అటవీ నిపుణుల సాయంతో పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా జల్లెడ పట్టాలని సలహా

*కాకినాడ జిల్లా, తుని మండలం సీహెచ్ అగ్రహారంలో వారం రోజుల క్రితం అదృశ్యమైన బాలిక జ్ఞానేశ్వరి ఆచూకీని వీలైనంత వేగంగా కనుగొనాలని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై ఆయన శనివారం కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి, గాలింపు చర్యల పురోగతిని సమీక్షించారు. వారం రోజులు గడుస్తున్నా బాలిక ఆచూకీ లభించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, దర్యాప్తును మరింత ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ విషయంపై ఆయన పలుమార్లు పోలీసు ఉన్నతాధికారులతో చర్చించారు.*

ప్రస్తుతం పోలీసు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నిర్వహిస్తున్న గాలింపు చర్యలకు అదనంగా మరిన్ని బృందాలను రంగంలోకి దించాలని పవన్ కల్యాణ్ సూచించారు. ముఖ్యంగా, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) సేవలను కూడా వినియోగించుకోవాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాలిక ఇంటి పరిసరాల్లో దట్టమైన అటవీ ప్రాంతం ఉన్నందున, ఆ ప్రాంతంలో విస్తృతంగా జల్లెడ పట్టాలని తెలిపారు. అడవుల్లో తిరగడంలో నైపుణ్యం ఉన్న నిపుణులు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నైట్ వాచర్లు, బేస్ క్యాంప్ వాచర్ల సహాయం తీసుకోవడం ద్వారా గాలింపును మరింత ప్రభావవంతంగా మార్చాలని సలహా ఇచ్చారు.



2లో

## రాజధాని నిర్మాణ వ్యయాలపై జగన్‌కు మంత్రి
# నారాయణ ఘాటు కౌంటర్

● గెజిటెడ్ అధికారుల నివాసాలకు చదరపు అడుగుకు రూ. 3,684 చొప్పున కేటాయించామన్న మంత్రి ● అమరావతిలో మొత్తం 69 వంతెనలు నిర్మిస్తున్నామని వెల్లడ ● అమరావతి అభివృద్ధిపై అసత్య ప్రచారం చేయొద్దని వైసీపీకి హితవు

# కాంగ్రెస్ ప్రభుత్వం
## పై కేటీఆర్ ఫైర్.. కార్యకర్తలకు దిశానిర్దేశం



- సిరిసిల్లలో పార్టీ శ్రేణులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు
- తనపై కోపంతో స్థానిక నేతలను వేధించొద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి
- ధాన్యం కొనుగోళ్లలో గన్నీ బ్యాగుల కొరతపై విమర్శలు

మిగతాది 2లో

## భారత సైన్యానికి కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్
# జనరల్ ధీరజ్ సేథ్

**పలు కీలక కమాండ్లకు నాయకత్వం**



- కొత్త ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్
- జూన్ 30న బాధ్యతల స్వీకరణ
- ఉపేంద్ర ద్వివేది అదే రోజు రిటైర్
- 1986లో సైన్యంలో చేరిన సేథ్
- సైన్యం ఆధునికీకరణలో కీలక పాత్ర

భారత సైన్యానికి కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జూన్ 30న కొత్త ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అదే రోజు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ధీరజ్ సేథ్ భారత సైన్యానికి తదుపరి అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందారు. 1986 డిసెంబర్‌లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో అధికారిగా సైన్యంలో చేరారు. దాదాపు 40 ఏళ్లకు పైగా సాగిన సైనిక జీవితంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఎడారి ప్రాంతాల్లో ఆర్మర్డ్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించిన ధీరజ్ సేథ్, పశ్చిమ సరిహద్దు మిగతాది 2లో

# అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి..
## హెల్త్‌కేర్‌లో ప్రెడిక్టివ్ విధానం: మంత్రి సత్యకుమార్



● అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సత్యకుమార్ ● ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని వ్యాఖ్య ● ప్రజల వద్దకే వెళ్లి 45 రకాల వైద్య సేవలు అందిస్తున్నామని వెల్లడి

*ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. తిరుపతి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఇదే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించారని గుర్తుచేశారు.*

గత రెండేళ్ల కాలంలో వైద్య ఆరోగ్య శాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, భవిష్యత్ ప్రణాళికలను మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగి వివరాలను, వారి వైద్య చరిత్రను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఓపీ సేవల నుంచి స్పెషలిస్ట్ వైద్య సేవల వరకు అనేక సంస్కరణలు అమలు చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మిగతాది 2లో

## టీఎంసీలో ముదురుతున్న సంక్షోభం..
## కేంద్ర మంత్రితో మమత సన్నిహితుడు భేటీ



● టీఎంసీలో ముదురుతున్న అంతర్గత సంక్షోభం ● కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్‌తో సుదీప్ బందోపాధ్యాయ భేటీ ● ఎన్డీఏకు మద్దతిచ్చేందుకు సిద్ధమైన 20 మంది టీఎంసీ ఎంపీలు ● లోక్‌సభ స్పీకర్‌ను కలిసి ప్రత్యేక బ్లాక్‌గా గుర్తించాలని కోరనున్న తిరుగుబాటు వర్గం ● పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత మొదలైన విభేదాలు

పశ్చిమ బెంగాల్‌లో అధికార పీఠాన్ని కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో అంతర్గత సంక్షోభం తీవ్రతరమవుతోంది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడు, సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ శనివారం మిగతాది 2లో

## కూటమి ప్రభుత్వం
# విజయోత్సవాలు
## జరుపుకోవడం సిగ్గుచేటు



2

# రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం విఫలం

- నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయన్న బొత్స
- రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని విమర్శ
- సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని నిలదీత



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తికాకముందే అన్ని రంగాల్లో విఫలమైందని వైసీపీ శాసనమండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. ఈరోజు విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బొత్స పేర్కొన్నారు. రైతులకు తమ పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, జొన్న, మిగతాది 2లో

# దేనికైనా సిద్ధం
# ఎమ్మెల్యే బుడ్డా



కొట్టుకుందామా! కూర్చొని మాట్లాడుకుందామా! రెండు ఆప్షన్లు నీకే ఇస్తాను! ఇదేదో సింహ సినిమాలో బాలకృష్ణ చెప్పిన డైలాగు అనుకుంటే పొరపాటు పడినట్లే! ఈ డైలాగు చెప్పింది మరెవరో కాదు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి. రాజకీయ ప్రత్యర్థి, మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి పై రాజకీయ విమర్శనాస్త్రాలు సంధించారు. గత నెల 18 వ తేదీ నుండి బండి ఆత్మకూరులో శిల్ప చక్రపాణి రెడ్డి, పెట్రో మంటల చాటున బుడ్డా పై రాజకీయ విమర్శలు చేశారు. ఆనాటి నుండి రాజకీయ మంటలు చెలరేగాయి. సుని పెంట ఇళ్ల పట్టాల విషయంలోనూ ఒకరిపై నొకరు రాజకీయ విమర్శలు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో బుడ్డా పై శిల్పా చేసిన రాజకీయ విమర్శలకు తట్టుకోలేక కొందరు టిడిపి కార్యకర్తలు శిల్పా ఇంటిపై దాడి చేసే ప్రయత్నం చేశారు. ఈ సంఘటన తర్వాత, శిల్ప రాజకీయ విమర్శలు చేయడంలో వాతావరణం వేడెక్కిపోయింది. *ముఖ్యమంత్రి చంద్రబాబు వెన్నుపోటు పాలనకు రెండేళ్ల సందర్భంగా శిల్ప మళ్లీ బుడ్డా పై రెచ్చిపోయారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి శనివారం ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి సంబంధించి బూతులు ఏజెంట్లు క్లస్టర్లు ఇన్చార్జి లతోపాటు పార్టీ శ్రేణులతో ఆత్మకూరులో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో శిల్పా తనపై చేసిన ఆరోపణలను తిప్పికొడుతూ, ఆవేశంతో నిప్పులు చెరిగారు.*

మిగతా 8లో

# టీఎంసీలో ముదురుతున్న సంక్షోభం..
# కేంద్ర మంత్రితో మమత సన్నిహితుడు భేటీ

ఢిల్లీలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఈ



సమావేశంలో తిరుగుబాటు ఎంపీ శతాబ్ది రాయ్ సైతం పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీకి చెందిన సుమారు 20 మంది లోక్‌సభ సభ్యులు తమను ప్రత్యేక బృందంగా గుర్తించాలని కోరుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఇటీవల వెలువడిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో టీఎంసీ ఓటమి పాలవగా, బీజేపీ నేత సువేందు అధికారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ఓటమి అనంతరం పార్టీలో మొదలైన విభేదాలు ఇప్పుడు పార్లమెంటు స్థాయికి చేరాయి. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి తప్పించుకునేందుకు, బీజేపీలో విలీనం కాకుండానే ఎన్డీఏకు మద్దతు ఇవ్వాలని తిరుగుబాటు వర్గం భావిస్తోంది. కాకోలీ ఘోష్ దస్తీదార్ వంటి నేతల నేతృత్వంలో తామే అసలైన టీఎంసీ అని ఈ వర్గం వాదిస్తోంది. తిరుగుబాటు ఎంపీ జగదీష్ బసునియా వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ బృందం ఆదివారం ఢిల్లీలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారిని, సోమవారం (జూన్ 15న) లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలవనుంది. సభలో తమకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని వారు స్పీకర్‌ను కోరనున్నారు. తొలుత ప్రచారంలో ఉన్న 19 మంది తిరుగుబాటు ఎంపీల జాబితాలో సుదీప్ బందోపాధ్యాయ పేరు లేదు. అయితే, కేంద్ర మంత్రితో ఆయన నేరుగా సమావేశం కావడంతో పార్టీలో చీలిక లోతుగా ఉందనే విషయం స్పష్టమవుతోంది. అయితే, సుదీప్ తీరుపై టీఎంసీ ఎమ్మెల్యే కునాల్ ఘోష్ తీవ్ర విమర్శలు గుప్పించారు. మరోవైపు, పార్టీ విధేయ వర్గంలోని కొందరు నేతలు ఐక్యత కోసం ప్రయత్నిస్తున్నారు. గతంలో అభిషేక్ బెనర్జీపై విమర్శలు గుప్పించిన కల్యాణ్ బెనర్జీ, తాజాగా ఆయనను "నా కొడుకు వంటివాడు" అంటూ స్వరం మార్చారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిన అంగన్వాడీలకు
# తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్!

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమ పదవులకు రాజీనామా సమర్పించి, ఎన్నికల్లో ఓటమి



చెందిన అంగన్వాడీ టీచర్లు, సహాయకులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సదరు పోస్టుల్లో ఇప్పటి వరకు కొత్త నియామకాలు జరగని పక్షంలో, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జూన్ 13న అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలనే ఆకాంక్షతో ఉద్యోగాలను సైతం త్యాగం చేసిన అంగన్వాడీ సిబ్బందికి ప్రభుత్వ నిర్ణయం పెద్ద ఊరటనిచ్చింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, సదరు స్థానాలు ఖాళీగా ఉన్న పక్షంలో వారిని తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. ఈ నిర్ణయంపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పందిస్తూ, అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేయడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్య సేవలు అందించడంలో అంగన్వాడీల పాత్ర కీలకమని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వం తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35,781 అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తూ, ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలైన వారికి తిరిగి ఉపాధి లభించనుంది. ఇది వారి జీవనోపాధికి భరోసా కల్పించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో అమలవుతున్న పౌష్టికాహార కార్యక్రమాలు నిరంతరాయంగా, సమర్థవంతంగా కొనసాగేందుకు దోహదపడనుంది.

# తుని బాలిక అదృశ్యం ఘటనపై పవన్ కల్యాణ్ ఆరా...
# ఆధారం అనుకున్న పెంపుడు కుక్క మృతి

ఈ సందర్భంగా, జిల్లా ఎస్పీ చేపడుతున్న చర్యలను డిప్యూటీ సీఎంకు వివరించారు. బాలిక ఆచూకీ కోసం ఇప్పటికే 400 మందికి పైగా సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అత్యాధునిక డ్రోన్ల సహాయంతో అణువణువూ గాలిస్తున్నామని, బాలిక ఇంటి చుట్టుపక్కల ఉన్న 38 సీసీ కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించామని ఆయన పవన్ కల్యాణ్‌కు తెలియజేశారు. డిప్యూటీ సీఎం ఆదేశాల నేపథ్యంలో గాలింపు చర్యలను మరింత విస్తృతం చేసి, అదనపు బలగాలను సమీకరించి, బాలికను సురక్షితంగా గుర్తించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ఉన్నత స్థాయి నుంచి వస్తున్న పర్యవేక్షణతో ఈ కేసు దర్యాప్తులో మరింత వేగం పుంజుకుంది.

**తుని చిన్నారి అదృశ్యం కేసులో ఆధారం అనుకున్న శునకం మృతి**

చిన్నారి జ్ఞానేశ్వరి కేసులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బాలిక ఆచూకీ కనుగొనడంలో పోలీసులకు కీలక ఆధారంగా నిలుస్తుందని భావించిన కుటుంబం పెంపుడు కుక్క మరణించింది. దీంతో ఈ కేసు దర్యాప్తులో పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లయింది. తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సీహెచ్ అగ్రహారంలో నివసిస్తున్న సుంకర గణేష్, భవానీ దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి జూన్ 6వ తేదీన ఇంటి వద్ద ఆడుకుంటూ అదృశ్యమైన విషయం తెలిసిందే. పాపతో పాటు వారి పెంపుడు కుక్క కూడా కనిపించకుండా పోయింది. అయితే, కొన్ని రోజుల తర్వాత ఆ శునకం మాత్రమే తిరిగి ఇంటికి వచ్చింది. దీంతో బాలిక జాడ కోసం పోలీసులు ఆ కుక్కకు జీపీఎస్ ట్రాకర్ అమర్చి దాన్ని వదిలిపెట్టారు. జీపీఎస్ అమర్చిన తర్వాత ఆ శునకం సుమారు 80 నిమిషాల పాటు 8 కిలోమీటర్ల మేర సమీప పొలాలు, అటవీ ప్రాంతంలో తిరిగి, మళ్లీ ఇంటికి చేరుకుంది. కానీ, ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే కుప్పకూలి ప్రాణాలు విడిచింది. రోజుల తరబడి ఆహారం తీసుకోకపోవడం వల్లే అలసటతో అది మరణించి ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటికే పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, అటవీ శాఖ బృందాలు డ్రోన్ల సహాయంతో విస్తృతంగా గాలిస్తున్నప్పటికీ బాలిక ఆచూకీ లభించలేదు. ఇప్పుడు కీలక ఆధారం అనుకున్న శునకం కూడా మరణించడంతో ఈ కేసు మరింత మిస్టరీగా మారింది. పోలీసులు కిడ్నాప్ సహా ఇతర కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు.

# రాజధాని నిర్మాణ వ్యయాలపై జగన్‌కు
# మంత్రి నారాయణ ఘాటు కౌంటర్

అమరావతిలో నిర్మిస్తున్న హ్యాపీనెస్ హోమ్స్



నిర్మాణ వ్యయం కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల కంటే తక్కువగా ఉందని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. శనివారం అమరావతిలో పర్యటించిన ఆయన కొండవీటి వాగు, పాలవాగుపై జరుగుతున్న వంతెన నిర్మాణ పనులను పరిశీలించి మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధినేత జగన్ అమరావతిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న మంత్రి... ఆయన వ్యాఖ్యలు కౌంటర్ ఇచ్చారు. గెజిటెడ్ అధికారుల నివాసాల టెండర్ రూ.1,003 కోట్లకు, చదరపు అడుగుకు రూ.3,684 చొప్పున కేటాయించబడిందని చెప్పారు. అలాగే కేంద్ర ప్రభుత్వ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ టెండర్ రూ.1,234 కోట్లకు, చదరపు అడుగుకు రూ.3,945 చొప్పున అమలవుతోందని వివరించారు.

అమరావతి అభివృద్ధిలో భాగంగా సీఆర్డీఏ మొత్తం 69 వంతెనలను నిర్మిస్తోందని మంత్రి వెల్లడించారు. ఇందులో ప్రధాన వాగులపై 43 వంతెనలు, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ లేఅవుట్లలో మరో 26 వంతెనలు ఉన్నాయని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు. వంతెనల సమీపంలో పేరుకుపోయిన మట్టి, తాత్కాలిక కట్టలు, ఇతర అడ్డంకులను వెంటనే తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కొండవీటి వాగు, పాలవాగు, గ్రావిటీ కాలువల పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైతే అదనపు జేసీబీలను వినియోగించి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

వచ్చే ఏడాదిలోగా 69 వంతెనల్లో అధిక భాగం పూర్తవుతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. అమరావతి అభివృద్ధి పనులపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని ప్రతిపక్ష నేతలకు సూచించిన ఆయన, ఆరోపణలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# భారత్ అరుదైన ఘనత..
## ఖండాంతర క్షిపణులనూ అడ్డుకునే సామర్థ్యం!



రక్షణ రంగంలో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే అడ్డుకుని ధ్వంసం చేసే సామర్థ్యాన్ని డీఆర్‌డీఓ విజయవంతంగా పరీక్షించింది. సముద్రంలో శత్రు నౌకలను లక్ష్యంగా చేసుకొనే కొత్త క్షిపణి సామర్థ్యాన్నీ ప్రదర్శించింది. వరుసగా నిర్వహించిన మూడు ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతం కావడంతో అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థలు కలిగిన దేశాల సరసన భారత్ నిలిచింది. డీఆర్‌డీఓ నిర్వహించిన మూడు వరుస పరీక్షల్లో ఇంటర్‌సెప్టర్ క్షిపణులు తమ లక్ష్యాలను కచ్చితంగా ఛేదించాయి. బహుళస్థాయి బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థ సామర్థ్యాన్ని ఈ పరీక్షలు నిరూపించాయి. ఆధునిక క్షిపణి ముప్పులను ఎదుర్కొనేలా రూపొందించిన ఈ వ్యవస్థ శత్రు బాలిస్టిక్ క్షిపణులను లక్ష్యానికి చేరకముందే నిర్వీర్యం చేయగలదని అధికారులు తెలిపారు. ఈ విజయాలతో భారత్ ప్రపంచంలోని కొన్ని దేశాలకే ఉన్న ప్రత్యేక సామర్థ్యాన్ని సొంతం చేసుకుంది. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు (ఐసీబీఎంలు) సహా అత్యంత ప్రమాదకరమైన క్షిపణి ముప్పును అడ్డుకునే రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసిన దేశాల జాబితాలో భారత్ చేరిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇది దేశ భద్రతా వ్యవస్థకు కీలక బలాన్ని చేకూర్చనుంది. మరోవైపు నేవల్ యాంటీ-షిప్ మిసైల్ (మీడియం రేంజ్) తొలి ఫ్లైట్ టెస్ట్‌ను కూడా డీఆర్‌డీఓ విజయవంతంగా పూర్తి చేసింది. మధ్యశ్రేణి దూరంలో శత్రు యుద్ధ నౌకలను కచ్చితంగా లక్ష్యంగా చేసుకునే ఈ క్షిపణి భారత నౌకాదళ దాడి సామర్థ్యాన్ని మరింత పెంచనుంది. ఈ విజయాలపై డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

## భారత సైన్యానికి కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో ఆర్మ్‌డ్ బ్రిగేడ్‌కు కమాండర్‌గా పనిచేశారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను పర్యవేక్షించే దళాలకు కూడా నాయకత్వం అందించారు. లెఫ్టినెంట్ జనరల్ హోదాలో భారత సైన్యంలో అత్యంత కీలకమైన స్ట్రైక్ ఫార్మేషన్లలో ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండర్‌గా వ్యవహరించారు. ఢిల్లీ ప్రాంత జనరల్ ఆఫీసర్ ఇన్ కమాండింగ్‌గా కూడా పనిచేశారు. ఈ సమయంలో దేశీయ, అంతర్జాతీయ సైనిక కార్యక్రమాల సమన్వయం బాధ్యతలు నిర్వర్తించారు. సైన్యాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ధీరజ్ సేథ్ కీలక పాత్ర పోషించారు. సైనిక సామర్థ్యాల పెంపు, భవిష్యత్ వ్యూహాల రూపకల్పన, దళాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాల్లో ఆయన సేవలు విశేష గుర్తింపు పొందాయి. ధీరజ్ సేథ్ హయ్యర్ కమాండ్ కోర్స్, నేషనల్ డిఫెన్స్ కాలేజ్‌లో ఉన్నత శిక్షణ పొందారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో నిర్వహించే ప్రతిష్ఠాత్మక కమాండ్ అండ్ స్టాఫ్ కోర్స్‌లో కూడా పాల్గొన్నారు. సమకాలీన సైనిక వ్యూహాలపై ఆయనకు విస్తృత అవగాహన ఉందని అధికారులు చెబుతున్నారు.

# రెండేళ్లలోనే కూటమి ప్రభుత్వం విఫలం

మామిడి పంటలకు కూడా కనీస మద్దతు ధర అందడం లేదని అన్నారు. ఆక్వా రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఆరోపించారు. విద్యాశాఖను మంత్రి నారా లోకేశ్‌కు అభివృద్ధి కోసం అప్పగించారా లేక దాన్ని నిర్వీర్యం చేయడానికా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవన్ హామీలు ఏమయ్యాయని నిలదీశారు. ఆడబిడ్డ నిధి పథకాన్ని ప్రభుత్వం దాదాపు పక్కన పెట్టిందని విమర్శించారు. ఇటీవల తిరుపతిలో నిర్వహించిన సభను విజయోత్సవ సభగా కాకుండా 'వెన్నుపోటు ఉత్సవం'గా అభివర్ణించిన బొత్స, టీడీపీని 'వెన్నుపోటు పార్టీ'గా పేర్కొన్నారు. రైతులు యూరియా కోసం ఒడిశా నుంచి ఒక్కో బస్తా రూ.600 చొప్పున కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని ఈ ప్రభుత్వానికి ఒక్క నిమిషం కూడా అధికారంలో కొనసాగే హక్కు లేదని బొత్స వ్యాఖ్యానించారు. 'రెండేళ్ల వెన్నుపోటు' ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## కూటమి ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న తరుణంలో... ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన 'సూపర్ సిక్స్' వాగ్దానాలు రెండేళ్ల పాలనలో పూర్తిగా అట్టర్ ఫ్లాప్ అయ్యాయని ఆమె దుయ్యబట్టారు. రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని, కేవలం అప్పులు చేయడంలోనే ప్రభుత్వం రికార్డులు సృష్టిస్తోందని షర్మిల ఎద్దేవా చేశారు. 'పబ్లిసిటీ పీక్.. పాలన వీక్', 'అప్పులు ఫుల్.. అభివృద్ధి నిల్' అని విమర్శించారు. ప్రస్తుత పరిపాలన అంతా ఒక 'మాయాబజార్'లా కనిపిస్తోందని, ప్రజలను భ్రమల్లో ముంచేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తామన్న హామీ ఎటు పోయిందని నిలదీశారు. బుట్టెడు ఆశలు చూపి ప్రజల నుంచి ఓట్లు దండుకున్న ఎన్డీయే నేతలు, అధికారంలోకి వచ్చాక కేవలం గుప్పెడు హామీలను కూడా సరిగ్గా అమలు చేయలేకపోయారని ఆరోపించారు. ప్రజలను దారుణంగా వంచించిన ఈ ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.

## అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి.. హెల్త్‌కేర్‌లో ప్రెడిక్టివ్ విధానం

సాంప్రదాయ వైద్య విధానాల నుంచి 'ప్రెడిక్టివ్ హెల్త్‌కేర్' విధానంలోకి అడుగుపెట్టామని మంత్రి చెప్పారు. అంటే.. వ్యాధి వచ్చాక వైద్యం చేయడం కంటే, అది రాకముందే గుర్తించేలా వ్యవస్థను మార్చామన్నారు. ప్రజల వద్దకే నేరుగా వెళ్లి 45 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని, దీనివల్ల వ్యాధులను ముందే గుర్తించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామని వివరించారు. అలాగే టెలిమెడిసిన్ ద్వారా రోగుల సందేహాలకు నిపుణులైన వైద్యులతో సమాధానాలు ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న మెరుగైన సేవల వల్ల ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం, సంతృప్తి పెరిగాయని.. అందుకే ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని సత్యకుమార్ అన్నారు. తమ ప్రభుత్వ పనితీరుకు ఆసుపత్రుల్లోని గణాంకాలే నిదర్శనమని చెప్పారు. 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్య సాధనలో 'ఆరోగ్యాంధ్రప్రదేశ్' అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని చెబుతూ.. ఈ మార్పునకు సహకరించిన వైద్య సిబ్బందికి, అధికారులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్.. కార్యకర్తలకు దిశానిర్దేశం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం సిరిసిల్లలో నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తనతో ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా సిరిసిల్లలోని బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బతుకమ్మ చీరల ఆర్డర్లను రద్దు చేయడం ద్వారా స్థానిక చిన్న తరహా పరిశ్రమలను ప్రభుత్వం దెబ్బతీసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కనీసం గన్నీ బ్యాగులు కూడా అందుబాటులో లేవని, ఉన్నవాటిని ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 900 రోజులైనా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పార్టీ ముఖచిత్రంగా ప్రాజెక్ట్ చేయాలని, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# కోవర్టుల సంగతి తేలుస్తాం..
## వ్యవహారాన్ని రేవంత్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు

ఎక్కడ పొరపాటు జరిగింది, దీనికి బాధ్యులు ఎవరు అనే విషయాలపై ఇప్పటికే అంతర్గత విచారణ ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడ లోపం జరిగిందో, ఎవరి పాత్ర ఉందో సమగ్రంగా సమీక్షిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో ఉండి ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే కోవర్టులను త్వరలోనే గుర్తిస్తామని మహేశ్ గౌడ్ హెచ్చరించారు. "లీక్ వీరులు ఎవరో, గ్రీక్ వీరులు ఎవరో త్వరలో అందరికీ తెలుస్తుంది" అని అన్నారు. నామినేషన్ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్టీ నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. అంతర్గత విచారణ వేగం పుంజుకోవడంతో లీకుల వెనుక ఉన్న అసలు వ్యక్తులు త్వరలోనే బయటపడే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

## బయట నుంచి చూస్తే సంఘ్‌ను అర్థం చేసుకోలేరు: మోహన్ భాగవత్

తిరువనంతపురం: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ప్రపంచంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ అని, అయితే అత్యంత అపార్థానికి గురవుతున్న సంస్థ కూడా ఇదేనని ఆ సంస్థ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. స్వయం సేవకులు యూనిఫాంలో రూట్‌మార్చ్‌లు చేయడం, కర్రలతో ఎక్సర్‌సైజులు చేయడం చూసి పారామిలటరీ సంస్థ అని ఎవరైనా అనుకుంటే అది పొరపాటేనని అన్నారు. సంఘ్‌ను బయట నుంచి చూసి అర్థం చేసుకోవడం చాలా కష్టమని చెప్పారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కేరళంలోని తిరువనంతపురంలో శనివారంనాడు జరిగిన ప్రబుద్ధ పౌర సంఘం (ప్రముఖ్ నాగరిక్ సంఘోష్టి) కార్యక్రమంలో మోహన్ భాగవత్ మాట్లాడారు. 'ఆర్ఎస్ఎస్‌ను బయట నుంచి చూసి అర్థం చేసుకోవడం చాలా కష్టం. ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా దానిని లోతుగా అర్థం చేసుకోవచ్చు. సంఘ్ గురించి విశ్వసనీయ వనరుల నుంచి సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తే సంఘ్ గురించి తెలుస్తుందని అన్నారు.

# అగ్ని వీర్ ఆర్మీకి బి.కోడూరు వాసి ఎంపిక



బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 13: అగ్ని వీర్ ఆర్మీలో సాధారణ విధులు నిర్వహించేందుకుగాను బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న బి.కోడూరు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ ఎంపిక అయ్యారు. భారత సైన్యంలో యువతకు దేశ సేవ చేసే అవకాశం కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వల్పకాలిక సైనిక నియామక పథకమే అగ్ని వీర్. సాధారణ కుటుంబంలో నుండి వచ్చిన మస్తాన్ 2024 సంవత్సరంలో కడపలో జరిగిన ఆర్మీ ఎంపికలో పాల్గొన్నాడు. అయితే రన్నింగ్ విభాగంలో మస్తాన్ ఉత్తీర్ణత కాలేకపోయాడు. తిరిగి ఈ సంవత్సరం గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన ఆర్మీ ఎంపికలో పాల్గొని అర్హత సాధించారు. ఈనెల 25 వ తేదీన కర్ణాటకలోని బెలగావిలో ట్రైనింగ్ సెంటర్ కు హాజరు కమ్మని ఆర్మీ విభాగం నుండి సమాచారం అందింది. తమ కుమారుడు అగ్ని వీర్ ఆర్మీలో విధులు నిర్వహించేందుకు అర్హత సాధించడం పట్ల తల్లిదండ్రులు షేక్ నజీర్ పర్వీన్ లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మస్తాన్ అన్న అమిర్ భాష సెల్పులు చేసే పని చేస్తుండగా, తండ్రి నజీర్ మాత్రం గౌండ పని చేస్తున్నారు. మస్తాన్ ఆర్మీకి ఎంపిక కావడం పట్ల బి. కోడూరు గ్రామంలోని హితులు, సన్నిహితులు అభినందనలు తెలియజేశారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ,

### త్రిబుల్ ఐటీ కి ఎంపిక



దొర్నిపాడు జూన్ 13 పల్లె వెలుగు న్యూస్ ప్రభుత్వ పాఠశాలల చదువులంటే చులకనగా చూసే తల్లిదండ్రులకు దొర్నిపాడు జడ్పీ పాఠశాలలో చదివిన పివి జ్యోతి, చిట్టి కళ 10వ తరగతి పరీక్షలలో పి.వి జ్యోతి577 చిట్టికల575 మార్కులు సాధించి త్రిబుల్ ఐటీ కి ఎంపికయ్యారు, వీరిఎంపికే ప్రభుత్వచదువుల విలువలను తల్లిదండ్రులు గ్రహించాలిఅని ఉపాధ్యాయులు కోరుతున్నారు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెన్న కేశ్వరి మాట్లాడుతూ మా పాఠశాలలో 95 మంది విద్యార్థి విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగఅందులో 88 మంది పాస్ అయినట్లు ఆమె తెలిపారు, వీరిలో పీవీ వెంకట జ్యోతి 577 చిట్టి కళ 575 మార్కు సాధించి త్రిబుల్ ఐటీకిఎంపికయ్యారన్నారు, పీవీ వెంకట జ్యోతి ఒంగోలు త్రిబుల్ ఐటీకిచిటికల ఇడుపులపాయత్రిబుల్ ఐటీ కి ఎంపికైనట్లు ఆమె తెలిపారు, ప్రతి తల్లిదండ్రి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆమె కోరారు,

# కర్నూలు సబ్‌డివిజన్ డీఎస్పీగా కె.వి. రాఘవేంద్ర బాధ్యతల స్వీకరణ

- శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే నా ప్రాధాన్యత
- అడిషనల్ ఎస్పీగా పదోన్నతిపై వెళ్లిన జె. బాబు ప్రసాద్ స్థానంలో నియామకం



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు సబ్‌డివిజన్ నూతన డీఎస్పీగా కె.వి. రాఘవేంద్ర శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ డీఎస్పీగా విధులు నిర్వహించిన జె. బాబు ప్రసాద్ అడిషనల్ ఎస్పీ (ూూూ)గా పదోన్నతి పొంది, ఏపీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రభుత్వం కె.వి. రాఘవేంద్ర వారిని నియమించడంతో ఆయన ఈ రోజు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన డీఎస్పీ కె.వి. రాఘవేంద్ర మాట్లాడుతూ.. కర్నూలు సబ్‌డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. డీఎస్పీ స్థాయి అధికారిగా తొలిసారిగా కర్నూలు జిల్లాలో బాధ్యతలు చేపట్టడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు.

**సుదీర్ఘ అనుభవం.. ఎస్సై నుండి డీఎస్పీ వరకు:** నూతన డీఎస్పీ కె.వి. రాఘవేంద్ర పోలీసు శాఖలో సుదీర్ఘమైన పని అనుభవం ఉంది. ఆయనకు సంబంధించిన సేవల వివరాలు ఇలా ఉన్నాయి: స్వస్థలం: నెల్లూరు జిల్లా. పోలీసు శాఖలోకి ప్రవేశం: నవంబర్ 1996లో ఎస్సై (ూ×)గా విధుల్లో చేరారు. సీఐగా పదోన్నతి: జూలై 2010లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (జ×)గా ప్రమోషన్ పొందారు. డీఎస్పీగా పదోన్నతి: ఇటీవలే మే 1, 2026న డీఎస్పీగా పదోన్నతి సాధించారు. ఆయన తన సర్వీసులో ఎస్సైగా, సీఐగా ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ఎక్కువ కాలం పనిచేసి, సమర్థవంతమైన అధికారిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కర్నూలు జిల్లాలో కూడా అదే రీతిన ప్రజలకు జవాబుదారీగా ఉంటూ శాంతిభద్రతలను కాపాడతానని నూతన డీఎస్పీ భరోసా ఇచ్చారు.

## నవతెలంగాణ స్టాఫ్ రిపోర్టర్ ఎర్రం సతీష్ కు పితృవియోగం



మల్హర్ :- రావు నవతెలంగాణ దినపత్రిక భూపాలపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఎర్రం సతీష్ తండ్రి ఎర్రం సమ్మయ్య (75) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతిచెందారు. విషయం తెలుసుకున్న సతీష్ స్వగ్రామం పెద్దపూర్ కు నవతెలంగాణ ఉమ్మడి వరంగల్ మేనేజర్ దేవేందర్ రావు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బంధు సాయిలు, భూపాలపల్లి, ములుగు జిల్లాల ఇంఛార్జీలు ప్రభాకర్, పాషా, మల్హర్, గణపూర్, రేగొండ మండలాల విలేకరులు చింతల కుమార్ యాదవ్, దూలం కుమార్, రహీం పాషా, జిపిఓ సుధాకర్ హాజరై పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# దివ్యాంగులు, వృద్ధులకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి భరోసా.

*☛ఈ నెల 15 వ తేదీన సుమారు రూ. 4 కోట్ల విలువగల, 3 వేల మందికి పైగా దివ్యాంగులు, వయో వృద్ధుల పరికరాలు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చేతుల మీదుగా పంపిణీ.*

**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

నంద్యాల పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న అర్హులైన దివ్యాంగులకు, వయో వృద్ధులకు తానున్నానన్న భరోసా నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఇస్తున్నారు. భారత ప్రభుత్వం ఏ డి ఐ పి పథకం క్రింద ఎ ఎల్ ఎం సి ఓ ద్వారా దివ్యాంగులకు సహాయ పరికరాలు, వయో వృద్ధులకు సీనియర్ సిటిజన్ల సంక్షేమశాఖ ఎ పి డి ఏ ఎస్ సి ఏ సి పథకం ద్వారా సహాయక పరికరాలు ఈ నెల 15 వ తేదీన సోమవారం ఉదయం 11 గంటలకు నంద్యాల టెక్కె వ్యవసాయ



మార్కెట్ యార్డు ఆవరణలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చేతుల మీదుగా పంపిణీకి ఏర్పాట్లు చేశారు. సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ వారు నిర్ధారించిన షెడ్యూల్ ప్రకారం, భారత ప్రభుత్వ ఎ డి ఐ పి పథకం కింద, ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ( ఏ ఎల్ ఐ ఎం సి ఓ) సహకారంతో, అవసరమైన దివ్యాంగులకు వివిధ సహాయ పరికరాలు, ఉపకరణాలు ఉచితంగా అందించడానికి, గత ఏడాది 28-06-2025 నుండి 18-07-2025 వరకు నంద్యాల జిల్లాలోని 07 అసెంబ్లీ నియోజకవర్గాలలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అసెస్‌మెంట్ క్యాంపులు నిర్వహించారు. ఆ ప్రత్యేక శిభిరాల్లో అర్హులైన దివ్యాంగులు, వయో వృద్ధులను గుర్తించి వారికి అవసరమైన పరికరాలు సుమారు రూ. 4 కోట్ల విలువగల, 3 వేల మందికి పైగా లబ్ధిదారులకు అవసరమైన పరికరాలు ఇప్పటికే నంద్యాల గోదాములకు చేరుకున్నాయి. వాటిని ఈ నెల 15 వ తేదీ నంద్యాల టెక్కె వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంబందించిన యంత్రాంగం ఏర్పాట్లు చేసి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నారు.

# తిరుపతిలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభ: అశేష జనసంద్రం

- ప్రతి ఇంటికీ సుపరిపాలన, సంక్షేమం: రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మ





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతిలో నిర్వహించిన "నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం" విజయోత్సవ సభ అశేష జనసంద్రమైంది. ఎన్డీఏ ప్రభుత్వ సుపరిపాలనకు మద్దతుగా రాష్ట్ర నలుమూలల నుండి ప్రజలు భారీగా ఈ సభకు తరలివచ్చారు. ఈ చారిత్రాత్మక విజయోత్సవ సభలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్, నంద్యాల పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు కమ్మరి పార్వతమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కమ్మరి పార్వతమ్మ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రికార్డు స్థాయి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో దూసుకుపోతోందని కొనియాడారు. "నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం" అనే నినాదంతో ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ చేరుతోందని ఆమె స్పష్టం చేశారు. "రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఒకవైపు అభివృద్ధిని, మరోవైపు సంక్షేమాన్ని సమాంతరంగా తీసుకెళ్తున్న ఘనత మన ఎన్డీఏ ప్రభుత్వానికే దక్కుతుంది. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న చంద్రబాబు నాయుడు నాయకత్వానికి రాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. దానికి ఈ రోజు తిరుపతిలో తరలివచ్చిన జనసంద్రమే నిదర్శనం" అని పార్వతమ్మ పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి, అలాగే మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి తన పదవులే నిదర్శనమని, రాబోయే రోజుల్లో ప్రభుత్వం మరిన్ని రికార్డు స్థాయి విజయాలు సాధిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ విజయోత్సవ సభలో కూటమి ప్రభుత్వ ముఖ్య నేతలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# జి.జి.హెచ్‌లో నర్సింగ్ సిబ్బందికి బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన

- నిబంధనలు పాటిస్తేనే సంక్రమణ వ్యాధులకు అడ్డుకట్ట: సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు
- ఏ రంగు డబ్బాలో ఏ వ్యర్థాలు వేయాలో వివరించిన అధికారులు






పల్లె వెలుగు కర్నూలు బ్యూరో స్థానిక గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్టాఫ్ నర్సులకు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి ప్రాంగణంలో జరిగిన ఈ శిక్షణలో బయోమెడికల్ వ్యర్థాల వర్గీకరణ, వాటిని సక్రమంగా పారబోసే విధానాలపై అధికారులు సిబ్బందికి క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. బయోమెడికల్ వ్యర్థాల సక్రమ నిర్వహణ ద్వారా సంక్రమణ వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. విధులు నిర్వహించే సమయంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత భద్రతా పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలని, ఆసుపత్రి పరిశుభ్రత పరిరక్షణలో ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. వ్యర్థాల వర్గీకరణ -- రంగుల డబ్బాల ప్రాధాన్యత: ఆసుపత్రిలో సేకరించే బయోమెడికల్ వ్యర్థాలను ఐసీఎన్ విభాగం నిబంధనల ప్రకారం క్రింది విధంగా వర్గీకరించి పారవేయాలని అధికారులు నర్సింగ్ సిబ్బందికి సూచించారు: పసుపు రంగు డబ్బా: మానవ శరీర అవశేషాలు, రక్తంతో కలుషితమైన వ్యర్థాలు. ఎరుపు రంగు డబ్బా: ప్లాస్టిక్ బయోమెడికల్ వ్యర్థాలు (గ్లూకోజ్ బాటిళ్లు, సిరంజీలు మొదలైనవి). తెలుపు రంగు డబ్బా (షార్ప్స్ కంటైనర్): సూదులు, బ్లేడ్లు మరియు ఇతర పదునైన వస్తువులు. (దీనిలో ఎల్లప్పుడూ ఒక శాతం హైపోక్లోరైట్ ద్రావణం తప్పనిసరిగా ఉండాలి). నీలం రంగు డబ్బా: గాజు వ్యర్థాలు మరియు విరిగిపోయిన మందుల సీసాలు.

చేతులు శుభ్రం చేసుకునే వరకు అప్రమత్తత అవసరం: ఇదివరకే శానిటేషన్ సిబ్బందికి ఈ ప్రక్రియపై అవగాహన కల్పించామని, తాజాగా వార్డుల్లో నిరంతరం అందుబాటులో ఉండే స్టాఫ్ నర్సులకు ఈ ప్రత్యేక శిక్షణ అందించినట్లు అధికారులు తెలిపారు. విధులు నిర్వహించే సమయంలో ముఖం, ముక్కు, కళ్లను చేతులతో తాకరాదని.. చేతులను యాంటీసెప్టిక్ సబ్బుతో శుభ్రంగా కడుక్కునే వరకు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీ.ఎస్.ఆర్.ఎం.ఓ డాక్టర్ పి. పద్మజ, డిప్యూటీ సీ.ఎస్.ఆర్.ఎం.ఓ డాక్టర్ వి. పద్మజ, అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ ఎం.వి. కిరణ్ కుమార్, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీమతి గౌరి, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్స్ టి. సంపత్ మరియు ఆసుపత్రి స్టాఫ్ నర్సులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాయలసీమ యూనివర్సిటీలో అవినీతి

## పై ప్రశ్నించిన విద్యార్థి నాయకులను యూనివర్సిటీ నుండి తొలగించడం చాలా బాధాకరం.

- రాయలసీమ యూనివర్సిటీ నుంచి తొలగించిన విద్యార్థి నాయకులను తిరిగి అనుమతి ఇవ్వకుంటే యూనివర్సిటీ ముట్టడికి సిద్ధం.
- డెమొక్రటిక్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్.రియాజ్ డిమాండ్.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. రాయలసీమ యూనివర్సిటీలో అవినీతి పై ప్రశ్నించిన విద్యార్థి నాయకులను యూనివర్సిటీ నుండి తొలగించడం చాలా బాధాకరమని, డెమొక్రటిక్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ రియాజ్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్బంగా డెమొక్రటిక్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ లో జరిగే అన్యాయాలు అక్రమాలు, వీసీ యొక్క అరాచకాలు గురించి పోరాడుతున్న ఆర్ పి ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజు పైన అక్రమ కేసులు ఎత్తి వేయాలని మరియు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్ ల ను రాయలసీమ యూనివర్సిటీ నుండి తొలగించడం చాలా దుర్మార్గమైన చర్యయని అంతేకాకుండా, ఎన్నో ఏండ్లుగా ఉద్యమాలు చేస్తూ విద్యార్థుల కోసం వారి సంక్షేమం కోసం పోరాడుతుంటే వారినీ యూనివర్సిటీ నుంచి తొలగించడం సరికాదని అన్నారు. అంతేకాకుండా ప్రస్తుత రిజిస్టర్ విజయ్ కుమార్ నాయుడు వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గా వున్నప్పుడు ల్యాబ్ పరికరాల్ కొనుగోలు పై అవకతవకలు లక్షలు లో ఖర్చులు, ఇతర బిల్లులు



లో అవకతవకలు జరిగాయని దేశంలో ఎక్కడ లేని యూనివర్సిటీ లోని ఓ కాంట్రాక్టు ఉద్యోగికి 95వేల రూపాయలు జీతం ఇవ్వడం యూనివర్సిటీ అధికారులకే చెల్లిందని నిబంధనలు కు విరుద్ధం గా యూనివర్సిటీ పరిధిలో ని 6 బి, ఈ డి కాలేజీ ల కు బినామీ గా ఉండడం,వర్సిటీలో ని పురుషులు వసతి గృహం లోని ఓ బ్లాకు కు జిం3 అనుమతి తీసుకొని బిల్లులు మంజూరు చేసుకొని జిం2నిర్మించి ఆ సొమ్మును కాజేయడం జరిగిందనీ తెలిపారు. కాబట్టి రాయలసీమ యూనివర్సిటీ లో జరిగిన అక్రమాలకు కేరఫ్ అడ్రెస్స్ గా నిలిచి న యూనివర్సిటీ వీసీ మరియు రిజిస్టర్ పైన చర్యలు తీసుకోవాలని గౌరవ మంత్రి వర్యులు టిజి భరత్ కూడా లెటర్ రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డి జి బి కి విచారణ చేయాలనీ సిఫార్సు లేఖ వ్రాయడం జరిగిందని తెలిపారు. కావున రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరిగిన అక్రమలను బయట కు తీసి వాటి విచారణ జరిపించాలని కోరిన విద్యార్థి సంఘాల నాయకులు ను యూనివర్సిటీ నుండి తొలిగించడం ఖండిస్తూ అదేవిదంగా వారిని తిరిగి మల్లీ యూనివర్సిటీ లోకి తీసుకోవాలని లేని పక్షం లో రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో రాయలసీమ యూనివర్సిటీ ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

*ఈ కార్యక్రమం లో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ విద్యార్థి విభాగం సోషల్ మీడియా రాష్ట్ర అధికార ప్రతినిధి నాగసారి సుంకన్న,ఖాదర్ భాష,అబ్దుల్,కిరణ్,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.*

# మా పొట్ట కొట్టొద్దు బాబూ."

## యజమాని కొడుకు కాళ్లు పట్టుకుని రోదించిన వృద్ధ తల్లులు.

**నంద్యాల ప్రభుత్వాసుపత్రి వద్ద ఎనిమిదో రోజుకు చేరిన శానిటేషన్ కార్మికుల దీక్షలు.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. కరోనా కష్టకాలంలో ప్రాణాలను పణంగా పెట్టి, గత 20 ఏళ్లుగా నంద్యాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సేవలందించిన వృద్ధ తల్లులకు ఇవాళ కన్నీళ్లే మిగిలాయి. కేవలం 50 ఏళ్లు నిండాయనే సాకుతో, ముందస్తు సమాచారం లేకుండా 'పద్మావతి మెడికల్ ఏజెన్సీ' 13 మంది శానిటేషన్ కార్మికులను అన్యాయంగా విధుల్లోంచి తొలగించింది. తమను తిరిగి పనిలోకి తీసుకోవాలంటూ ఆ తల్లులు చేస్తున్న న్యాయపోరాటం శనివారానికి ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ దీక్షా శిబిరం వద్ద శనివారం అత్యంత హృదయవిదారక దృశ్యం చోటుచేసుకుంది. పద్మావతి మెడికల్ ఏజెన్సీ అధినేత భాస్కర్ నాయుడు కుమారుడు కారులో అటుగా వెళ్తుండడం గమనించిన వృద్ధ మహిళా కార్మికులు పరుగు పరుగున ఆయన వద్దకు వెళ్లారు. వణుకుతున్న చేతులతో, కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఆయన కాళ్లు పట్టుకున్నారు. "మా వయసు చూసి కాదయ్యా... మా ఆకలి చూసి పని ఇవ్వండి... మా పిల్లల పొట్ట కొట్టొద్దు బాబూ" అంటూ రోదించారు. కానీ, కన్నతల్లి లాంటి వయసున్న ఆ శ్రమజీవుల కన్నీళ్లకు కరగని సదరు నిర్వాహకుని కుమారుడు, కనీసం వారిని పలకరించకుండానే హుటాహుటిన కారు ఎక్కి అక్కడి నుండి వెళ్ళిపోయాడు. ఏజెన్సీ నిర్వాహకుల రాతి గుండెతనాన్ని చూసి స్థానికులు సైతం ముక్కున వేలేసుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ ఉ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసులు మాట్లాడుతూ, రాయలసీమ జోన్-3 లో పద్మావతి మెడికల్ ఏజెన్సీ కార్మికుల పట్ల అత్యంత నిరంకుశంగా, అనాగరికంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఏజెన్సీ అక్రమాలపై 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' లో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. తొలగించిన 13 మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, వారికి రావలసిన 6 నెలల బకాయి జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ఏఐటీయూసీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితులు సుశీలమ్మ, తులశమ్మ, రాజమ్మ, సులోచన, సునీత, వెంకటేశ్వరమ్మ, నాగేశ్వరమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం:

## 'కౌన్సిల్ ఆఫ్ సివిల్ రైట్స్ అండ్ విజిలెన్స్' ప్రతిజ్ఞ



- ఆసుపత్రుల దోపిడీ, అవినీతి, విద్యాసంస్థల అక్రమాలపై సమరభేరి
- సామాన్యుడికి చట్టపరమైన అండగా నిలుస్తాం.. సంస్థ కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం.

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో సమాజంలో సామాన్యులపై జరుగుతున్న అన్యాయాలు, అవినీతి, వివిధ రంగాల్లో సాగుతున్న దోపిడీపై రాజీలేని పోరాటం చేయనున్నట్లు 'కౌన్సిల్ ఆఫ్ సివిల్ రైట్స్ అండ్ విజిలెన్స్' సంస్థ స్పష్టం చేసింది. కర్నూలు నగరంలోని బుధవారపేటలో గల సంస్థ కార్యాలయంలో ముఖ్య కార్యవర్గ సమావేశం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పలు కీలక అంశాలపై సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో రోగులపై జరుగుతున్న దోపిడీ, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, లంచగొండితనం మరియు పనుల జాప్యంపై తాము గళమెత్తుతామని హెచ్చరించారు. అలాగే, నిబంధనలకు విరుద్ధంగా పాడుబడిన భవనాల్లో తరగతులు నిర్వహిస్తూ, అక్రమ రుసుములు వసూలు చేస్తున్న విద్యాసంస్థల తీరును ఎండగడతామన్నారు. బాధితుల పక్షాన చట్టపరమైన పోరాటం: మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, పౌర హక్కుల కాలరాయడం, కుల అసమానతలు, రైతు మరియు భూ సమస్యలతో పాటు ఆలయాలలో పూజాదికాల పేరిట భక్తులను అడ్డగోలుగా దోపిడీ చేయడం వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో పోరాడతామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. సామాన్యులకు ఎక్కడ అన్యాయం జరిగినా తమ సంస్థ వారికి చట్టపరంగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

**భవిష్యత్ కార్యాచరణ:**-రాబోయే రోజుల్లో నేరుగా ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, పౌర, మానవ హక్కులపై అవగాహన సదస్సుల ద్వారా చైతన్యం పెంపొందిస్తామని నాయకులు పేర్కొన్నారు. సంస్థను మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే విస్తృతంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

**హాజరైన ప్రముఖులు:**- ఈ సమావేశంలో కౌన్సిల్ ఆఫ్ సివిల్ రైట్స్ అండ్ విజిలెన్స్ సంస్థ ముఖ్య నాయకులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. హాజరైన వారిలో: దండు విద్యాసాగర్ (సంస్థ అధ్యక్షుడు) వై. కిషోర్ కుమార్ రెడ్డి (కార్యదర్శి) ఎస్.ఎమ్.డి. ఇస్మాయిల్ (సంయుక్త కార్యదర్శి) సురేష్ కుమార్ (ఉపాధ్యక్షుడు) గొందిపల్ల మాలతి (కార్యవర్గ సభ్యురాలు మరియు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు) బండి మోహన్ బాబు (కార్యవర్గ సభ్యుడు) శ్రీకాంత్ శర్మ (జిల్లా ఆధ్యాత్మిక ప్రత్యేక కార్యకర్త)

# పల్లె నుంచి పట్టణ వరకు అభివృద్ధి

## చూడాలంటే తెలుగుదేశం పార్టీ తో మాత్రం సాధ్యం

**ప్రజలకు ఇచ్చిన మాట తప్పకుండా నెరవేర్చడమే చంద్రన్న లక్ష్యం**



ఆదోని (పల్లె వెలుగు): అభివృద్ధిలో వైసీపీ పార్టీ నాయకులపై మండిపడ్డ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రపంచ స్థాయి అభివృద్ధిలో దూసుకుపోతుంది, సంక్షేమ పథకాలు కూడా సక్రమంగా అమలు చేస్తున్నారు, రాష్ట్రం ఎంతో కష్ట కాలంలో ఉన్న కూడా ఎక్కడ తగ్గకుండా సంక్షేమంతో పాటు రాష్ట్ర అభివృద్ధి లో కూడా ముందుకు వెళుతుంది, ఆంధ్ర రాష్ట్రం ఎంతో అభివృద్ధి పథంలో నడుస్తుంది, ఇలాంటి సమయంలో వైయస్సార్ పార్టీ నాయకులు రెండేళ్ల పాలన సరిగ్గా లేదని ప్రచారం చేయడం ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందడం ఇష్టం లేక దుష్ప్రచారానికి పాల్పడ్డారు, వైయస్సార్ సిపి నాయకులకు కబ్జాలు ధర్నాలు రౌడీయిజం గొడ్డలిపోటు తప్ప రాష్ట్ర అభివృద్ధి కోసం కొంచమైనా ఇంగిత జ్ఞానం కూడా లేకుండా పోయింది, ఐదు సంవత్సరంలో ఆంధ్ర రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి ఆంధ్ర రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక పోయేలా చేశారు, ఒక్క అభివృద్ధి పని ఒక కంపెనీ కూడా తీసుకొని నిరుద్యోగులకు కూడా ఇవ్వలేకపోయింది, కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మన యువగళం నాయకుడు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఎంతో కష్టపడి కంపెనీల వెంటపడి మన రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడి పెట్టే కంపెనీలను తీసుకురావడంలో సక్సెస్ అయినాడు, అది ఓర్చుకోలేక వైసీపీ నాయకులు ముఖం చూపలేక ప్రభుత్వం మీద ఏదో నిందలు వేయడానికి ప్రయత్నిస్తున్నారు, కానీ ఆంధ్ర రాష్ట్ర ప్రజలు మీరు చేసిన దుష్ప్రచారాన్ని నమ్మే పరిస్థితిలో లేరు అని మాన్వి దేవేంద్రప్ప ఘాటుగా స్పందించారు, అంతేకాదు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పల్లె నుంచి పట్టణ వరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎంతో అభివృద్ధి చేస్తున్నారు, డ్రైనేజీలు గాని రోడ్లు గాని పేదలకు ఇళ్లు గాని చెప్పిన ప్రకారం సక్రమంగా నెరవేరుస్తున్నారు, ఈరోజు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు అని చెప్పారు.

# చంద్రన్న రెండేళ్ల సుపరి పాలన విజయోత్సవ సభ.

- రెండేళ్ళ కూటమి ప్రభుత్వ ప్రస్థానం విజయోత్సం సభను విజయవంతం చేయుటకై పిలుపు
- కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆదికృష్ణ.





ఆదోని (పల్లె వెలుగు): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాలు పూర్తి అయిన సంధర్భంగా విజయోత్సావాలను నిర్వహించడం జరుగుతుంది. ఇందులో భాగంగా కర్నూలు జిల్లాలో 15.06.2026న సోమవారం ఉదయం 10 గంటలకు కర్నూలు నగరంలోని బైరెడ్డి ఫంక్షన్ హాల్, బాలజి నగర్, సంతోష్ నగర్ దగ్గర నిర్వహించబడుతుంది. ఇందు నిమితమై ఈ రోజు తెలుగుదేశంపార్టీ, జనసేన, బిజేపి పార్టీల నాయకులు ఫంక్షన్ హాల్ ను పరిశీలించి రావడం జరిగింది.కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయం నందు కర్నూలు జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు సురేష్, బిజేపి జిల్లా అధ్యక్షులు రామక్రిష్ణ సమావేశమై చర్చించడం జరిగింది. అనంతరం వారు పత్రికల వారితో మాట్లాడుతూ ఈ విజయోత్సవ కార్యక్రమమునకు జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు నిమ్మల రామానాయుడు, జిల్లా మంత్రివర్యులు టి.జి.భరత్ గుప్తా, జోన్ 5 టిడిపి ఇంచార్జి శ్రీనివాస రెడ్డి, కర్నూలు జిల్లా కలెక్టర్ డా..ఎ.సిరి గారు, కూటమి పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, చైర్మన్లు హాజరు కానున్నారు. ఈ సభకు కూటమి పార్టీలకు చెందిన రాష్ట్ర/జిల్లా/ మండలం/ గ్రామం/ వార్డు/బూత్ స్థాయి నాయకులు అత్యధికంగా పాల్గొని విజయోత్సవ సభను విజయవంతం చేయవలసినదిగా విజ్ఞప్తి చేశారు.

# ఎల్లావత్తుల గ్రామంలో

## దేవాలయ భూముల కౌలు వేలం పాటలు.

రుద్రవరం. పల్లె వెలుగు : మండలంలోని ఎల్లా వత్తుల గ్రామంలో శనివారం దేవాలయ



భూముల కౌలు వేలం పాటలు నిర్వహించారు. గ్రూప్ దేవస్థానములు.2 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాయి జయచంద్రా రెడ్డి, దేవాలయ ఇన్స్పెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో ఎల్లా వత్తుల గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి, నాగేశ్వర స్వామి ఆలయాలకు సంబంధించిన 48.89 ఎకరాల భూములకు వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలంపాటల ద్వారా రూ 4 లక్షల 5000 రూపాయల ఆదాయం వచ్చినట్టు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సాయి జయచంద్రా రెడ్డి తెలిపారు. వేలం పాటల ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ వేలం పాటల్లో గ్రామ పెద్దలు పుల్లయ్య రైతులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వైసిపి కవ్వింపు చర్యలు ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు.

**తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షురాలు గుడిసే ఆది కృష్ణ.**



ఆదోని (పల్లె వెలుగు): మంత్రాలయం నియోజకవర్గంలోని మాధవరం గ్రామంలో నిన్న చోటుచేసుకున్న వైసీపీ కవ్వింపు చర్యలు ప్రజాస్వామ్యానికి, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఉన్నాయని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది



కృష్ణమ్మ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో గుడిసె ఆది కృష్ణమ్మ మాధవరం గ్రామానికి చేరుకుని నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర రెడ్డి తో పాటు స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై జరిగిన సంఘటనలపై వివరాలు తెలుసుకున్నారు. కార్యకర్తలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆవేశాలకు లోనుకాకుండా సంయమనం పాటించాలని, పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే ముందుకు సాగాలని ఆమె సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించే వారిపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల భద్రతకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను పార్టీ సమర్థవంతంగా ఎదుర్కొంటుందని గుడిసె ఆది కృష్ణమ్మ స్పష్టం చేశారు. మాధవరం గ్రామంలో నెలకొన్న పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించి, పార్టీ శ్రేణులకు ధైర్యం చెప్పి వారికి పూర్తి మద్దతు ప్రకటించారు.

## ఉపాధి కూలీ కుటుంబానికి తోటి శ్రామికుల అండ:
# 25 వేల ఆర్థిక సాయం అందజేత

పల్లె వెలుగు -ప్యాపిలి అపదలో ఉన్న తోటి కూలీ కుటుంబానికి మేమున్నామంటూ ఉపాధి



శ్రామికులు, స్థానిక నాయకులు తమ ఉదారతను చాటుకున్నారు. గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉపాధి కూలీ కళాయి రమిజా కుటుంబానికి శనివారం రూ. 25,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.పోతు దొడ్డి గ్రామానికి చెందిన కళాయి రమిజా అనే మహిళ ప్రతిరోజూ తోటి శ్రామికులతో కలిసి ఉపాధి హామీ పనులకు వెళ్లేది. ఆ పని ద్వారా వచ్చే డబ్బులతోనే ఆమె తన కుటుంబాన్ని పోషించుకునేది. అయితే, గత నెలలో జరిగిన ఒక బైక్ ప్రమాదంలో రమిజా అక్కడికక్కడే మరణించింది. అదే ప్రమాదంలో ఆమె కుమారుడైన కళాయి ఖలీల్‌కు కాలు విరిగింది. కుటుంబాన్ని పోషించే తల్లి అర్థంతరంగా మరణించడం, చేతికి వచ్చిన కొడుకు కాలు విరిగి మంచాన పడటంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ఈ విషయం తెలుసుకున్న తోటి ఉపాధి శ్రామికులు, ఫీల్డ్ అసిస్టెంట్ రవి చొరవ తీసుకుని తాము రెక్కాడితే గానీ డొక్కాడ లేని స్థితిలో ఉన్నప్పటికీ, తోటి కూలీ కుటుంబం కోసం ఉపాధి శ్రామికులంతా కలిసి విరాళాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జిట్టా కదిరప్ప, నారాయణ, పుల్లారెడ్డి కలిసి సేకరించిన 25,000 నగదును శనివారం రమిజా కుటుంబ సభ్యులైన మిడుతూరు కుల్లాయప్ప, కళాయి భావమ్మలకు అందజేశారు. తల్లిని కోల్పోయి, గాయాలతో బాధపడుతున్న ఆ కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని తోటి శ్రామికులు భరోసా ఇచ్చారు. కష్టాల్లో ఉన్న కూలీ కుటుంబాన్ని ఆదుకోవడానికి ఉపాధి శ్రామికులు, నాయకులు ముందుకు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని బండి గౌరీకి ట్రిపుల్ ఐటి ఒంగోలు క్యాంపస్‌లో సీటు... ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వరరావు.



రుద్రవరం. పల్లె వెలుగు : రుద్రవరం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని బండి గౌరీ ప్రతిభ కనబరిచి త్రిబుల్ ఐటీ ఒంగోలు క్యాంపస్‌లో సీటు సాధించడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచిందని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం మరియు విద్యార్థిని కృషి ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఉపాధ్యాయ బృందం మరియు సిబ్బంది,గ్రామ పెద్దలు బండి గౌరీని అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే ఈ విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. బండి గౌరీ సాధించిన ఈ ఘనతకు ఆమె తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, విద్యార్థిని ఉన్నత విద్యలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గత సంవత్సరం ముగ్గురికి వచ్చిందని అన్నారు. "కృషి ఉంటే విజయం సొంతం అవుతుంది" అనే నానుడికి బండి గౌరీ విజయం నిదర్శనం అని ప్రిన్సిపాల్ అన్నారు.

# ప్రాణాలతో చెలగాటమా..??
## పెచ్చులూడిన గోడల మధ్య బాలికల నివాసం.

**నంద్యాల బాలికల హాస్టల్ దుస్థితిపై ప్రశ్నిస్తున్న విద్యార్థులు,తల్లిదండ్రులు.**




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలో బాలికల హాస్టల్ పెచ్చులు ఊడిన గోడల మధ్య బాలికల నివాసం ఉంటున్నారు. పాఠశాలలు ప్రారంభమై విద్యార్థులు హాస్టళ్లకు చేరుకుంటే వారికి సురక్షితమైన వసతి కల్పించాల్సిన బాధ్యత ఎవరిది..?? భవనం శిథిలావస్థకు చేరినా అధికారులు ఎందుకు స్పందించడం లేదు..?? విద్యార్థినుల ప్రాణాల కంటే ప్రభుత్వానికి మరేదైనా ముఖ్యమా..?? నంద్యాల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న బాలికల వసతి గృహం పరిస్థితులు చూస్తే ఇలాంటి ప్రశ్నలే ఉత్పన్నమవుతున్నాయి. గోడల నుంచి పెచ్చులు ఊడిపడుతున్నాయి..పై కప్పులు బలహీనంగా కనిపిస్తున్నాయి..గదుల్లో కనీస వసతులు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు.అయినా సంబంధిత అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నా ముందస్తు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ నెల 12 నుంచి విద్యాసంస్థలు పునఃప్రారంభమవడంతో విద్యార్థినులు హాస్టల్‌కు చేరుకున్నప్పటికీ భవనం మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వర్షాకాలం ప్రారంభమైన వేళ శిథిల భవనంలో విద్యార్థినులను ఉంచడం ఎంతవరకు సమంజసమని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై నంద్యాల వైసీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు ఏదైనా ప్రమాదం జరగక ముందే త్వరగా చర్యలు తీసుకొని,శిథిలావస్థలో ఉన్న బాలికల వసతి భవనానికి మనమత్తులు చేయాలని కోరారు. విద్యార్థినుల భద్రతపై ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొంటుందా..?? లేక ఏదైనా విషాదం జరిగిన తర్వాతే చర్యలు చేపడుతుందా..?? శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టి,విద్యార్థినులకు సురక్షిత వసతి కల్పించాలని ప్రజలు,తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థినుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నా అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారు..?? హాస్టల్ భవనం బాగుచేసేందుకు నిధులు లేవా..?? లేక విద్యార్థుల సమస్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదా..?? అంటూ విద్యార్థుల తల్లితండ్రులు విమర్శిస్తున్నారు.

# 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

- **ఉదయం 9:30 గంటల నుండి వినతుల స్వీకరణ**
- **కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, మునిసిపల్ ఆఫీసుల్లో నిర్వహణ**
- **అర్జీల స్థితిని 1100 నంబర్ ద్వారా తెలుసుకోవచ్చు: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు జిల్లావ్యాప్తంగా ఈ నెల 15వ తేదీ (సోమవారం) ఉదయం 9:30 గంటల నుండి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సముదాయంలో గల సునయన ఆడిటోరియంలో ప్రజల నుండి అర్జీలను, వినతులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సుదూర ప్రాంతాల నుండి జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వినతులు సమర్పించేలా ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని



మండల రెవెన్యూ కార్యాలయాలు (వీ=ూ ఆఫీసులు), రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు (=ఖూ ఆఫీసులు), మరియు మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ఆయా అధికారులు ఈ 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. 1100 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు: అర్జీదారులు తాము సమర్పించిన దరఖాస్తులు ఏ దశలో ఉన్నాయి? వాటి పరిష్కారం ఎంతవరకు వచ్చింది? అనే సమాచారాన్ని తెలుసుకోవడం కోసం ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాన్ని కల్పించిందని కలెక్టర్ తెలిపారు. దీనికోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి వివరాలు కనుక్కోవచ్చని విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్‌లోనూ అర్జీల నమోదు: ప్రజా సమస్యలపై అర్జీదారులు నేరుగా వీవవనిశీఝఎ.ఖజూ.స్త్రశీజ.అఅ (మీకోసం) వెబ్‌సైట్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో తమ ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆ ప్రకటనలో వివరించారు.

# నిరసనలో డ్యాన్సులు, గాడిదలతో హంగామా.

- **ఇదా మీ రాజకీయ సంస్కారం?: వైసిపి పై మంత్రి ఫరూక్ ఆగ్రహం.**
- **డీఎస్సీ పై న్యాయ విచారణకు సిద్ధం: వైసిపి ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి ఫరూక్.**
- **నంద్యాల అభివృద్ధి పై వైసిపి దుష్ప్రచారం మానుకోవాలి : మంత్రి ఎన్ఎండీ ఫరూక్.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణ అభివృద్ధి అంటేనే టీడీపీ.. టీడీపీ అంటేనే అభివృద్ధి అని రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు . నంద్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా వైసిపి నాయకులు డ్యాన్సులు చేస్తూ ప్రజల ముందు నవ్వులపాలవుతున్నారని విమర్శించారు.

**డీఎస్సీపై తప్పుడు ప్రచారం మానుకోండి:**

డీఎస్సీ పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని, ఇది పూర్తి పారదర్శకంగా జరిగిందని ఉన్నతాధికారులే చెబుతున్నారని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. దీనిపై న్యాయ విచారణకు కూడా తాము సిద్ధమని ప్రకటించారు. "డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న వైసిపి నేతలు, ఒకవేళ అక్రమాలు జరగలేదని నిరూపితమైతే రాజకీయ సన్యాసం తీసుకుంటారా?" అని ఆయన సవాల్ విసిరారు.



వైసిపి నిరసనల పై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి ఫరూక్

వైసిపి నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమాలపై మంత్రి ఫరూక్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "ఎద్దుల బండి, గాడిదల పై నిరసనలు తెలుపడం, నిరసన కార్యక్రమంలో డ్యాన్సులు, ఈలలు వేయడం వారి సంస్కారానికి నిదర్శనం అన్నారు. తప్పు చేసిన వారిని గాడిద పై ఊరేగిస్తారు, అటువంటిది వీరు గాడిదలపై నిరసన తెలపడం చూస్తుంటే వీరే తప్పు చేశారని అర్థమవుతోంది" అని ఎద్దేవా చేశారు. జగన్‌ను కుంభకర్ణుడితో పోల్చిన మంత్రి ఫరూక్ , పనిపాట లేకనే ఆయన డీఎస్సీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు

.మార్కెట్ యార్డ్‌కు పెరిగిన ఆదాయం:

నంద్యాల అభివృద్ధిలో భాగంగా నంద్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీలో చేపట్టిన 'ఓపెన్ ఆక్షన్' విధానంతో ఊహించని ఆదాయం వచ్చిందని మంత్రి వెల్లడించారు. కేవలం 10 దుకాణాల వేలం ద్వారానే రూ. 3.50 లక్షల ఆదాయం లభించిందని, ఈ నెల 20 న మరిన్ని దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనివల్ల ప్రభుత్వానికి మరింత ఆదాయం చేకూరుతుందన్నారు.

**రాజకీయాలు హుందాగా ఉండాలి:**

రాజకీయాల్లో అడుగుపెట్టినప్పటి నుంచి తాను టీడీపీని నమ్ముకున్నానని, పార్టీలు మారుతూ అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత వైసిపి నాయకులకు లేదని మంత్రి ఫరూక్ అన్నారు. నియోజకవర్గాల డి-లిమిటేషన్ జరిగితే వైసిపి నాయకులు ఏ పార్టీలో ఉంటారో వారికే తెలియని పరిస్థితి నెలకొందని, గత 15 ఏళ్లలో వారు చేసిన అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు విమర్శలు మానుకుని, హుందాగా వ్యవహరించాలని మంత్రి ఫరూక్ సూచించారు.

*ఈ కార్యక్రమంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు , మాజీ టిడిపి రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు , మాజీ కౌన్సిలర్ కండే శ్యామ్ సుందర్ లాల్ స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.*

# ట్రావెల్ బస్సుకు ఘోర ప్రమాదం




కొలిమిగుండ్ల (పల్లె వెలుగు న్యూస్ )ప్రతినిధి :-

కొలిమిగుండ్ల లో ట్రావెల్ బస్సు ఘోర ప్రమాదం జరిగింది. చాగలమర్రి నుంచి తాడిపత్రి హాజీవళి దర్గాకు వెళుతున్న ట్రావెల్ బస్సు శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో కొలిమిగుండ్లకు చేరుకోగా కొలిమిగుండ్ల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు దగ్గర ప్రమాదం జరిగింది. రోడ్డుపై వస్తున్న ట్రావెల్ బస్సు ఇండియన్ పెట్రోల్ పంపు దగ్గర వస్తున్న టిప్పర్ ఢీకొన్నాయి. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఇరువురికి స్వల్ప గాయాలు అయ్యి మిగిలిన ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. విషయం తెలిసిన కొలిమిగుండ్ల సీఐ రమేష్ బాబు ఘటన స్థలానికి చేరుకొని గాయపడిన క్షతగాత్రులను హాస్పిటల్కు తరలించి చికిత్స చేయించి చాగలమరి నుంచి ట్రావెల్ బస్సు వీరిదే ఇంకొకటి వస్తూ ఉంటే అందులోకి ఈ బస్సులో ప్రయాణించే ప్రయాణికులను ఆ బస్సులోకి ఎక్కించి గమ్యస్థానానికి చేరే విధంగా చేశారు. అక్కడే ఉన్న సిఐ మద్దినేని రమేష్ బాబు కేసుకు సంబంధించిన వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తామని వివరించారు.

# నంద్యాల లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం:

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల లయన్స్ క్లబ్ 2026 -27 సంవత్సరానికి నూతన



నంద్యాల లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులు సందీప్ కుమార్.

కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నంద్యాల లయన్స్ క్లబ్ ఎన్నికల కమిటీ సభ్యులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లయన్స్ క్లబ్ సమాఖ్య మాజీ చైర్మన్ ఏ.వి.ఆర్.ప్రసాద్, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ రవి కృష్ణ,సీనియర్ సభ్యులు ఆంజనేయులు గుప్తా, డాక్టర్ సహదేవుడు, ఆడిటర్ గోపాలకృష్ణమూర్తి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షులుగా ముదియనూర్ సందీప్ కుమార్,కార్యదర్శిగా మేడా చంద్రశేఖర్,కోశాధికారిగా సురేష్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా పోసిన



నంద్యాల లయన్స్ క్లబ్ నూతన కార్యదర్శి మేడా చంద్రశేఖర్

సుబ్బారావు,కూర ప్రసాద్,ఇమ్మడి వెంకట రామకృష్ణుడు ఎంపికయ్యారు. మిగతా కార్యవర్గాన్ని నూతన అధ్యక్ష కార్యదర్శులు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిటీ సభ్యులు మాట్లాడుతూ నంద్యాల లయన్స్ క్లబ్ 1970 సంవత్సరంలో ప్రారంభించబడిందని, గత 56 సంవత్సరాలుగా నంద్యాల లయన్స్ క్లబ్ ప్రజలకు అనేక రకాల సేవా కార్యక్రమాల్ని నిరంతరంగా కొనసాగిస్తూ వస్తున్నదని అన్నారు. నూతన అధ్యక్ష



నంద్యాల లయన్స్ క్లబ్ నూతన కోశాధికారి సురేష్.

కార్యదర్శులుగా ఎంపికైన సందీప్, చంద్రశేఖర్, కోశాధికారి సురేష్ మాట్లాడుతూ రానున్న సంవత్సర కాలంలో లయన్స్ క్లబ్ తరఫున సామాజిక సేవా కార్యక్రమాలు,దివ్యాంగులకు, వృద్ధులకు సహాయ కార్యక్రమాలు,పర్యావరణ,విద్య ,సాంస్కృతిక ,క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

# ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ సర్వసభ్య సమావేశం

**- ఆళ్లగడ్డ ఆర్టిసి డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక**

**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 13 పల్లె వెలుగు**

ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ యూనిటీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం నాడు జరిగింది పట్టణంలోని టీఎస్ బ్రదర్స్ ఫంక్షన్ హాల్ నందు ఈ సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి కేఆర్ శేఖర్ లక్ష్మీకాంత్ జోనల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు రీజనల్ కమిటీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రీజినల్ సెక్రెటరీ శివరాం వర్కింగ్ ప్రెసిడెంట్ వీ పి రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమణ హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో చేస్తున్న కార్మికుల సమస్యలు తదితర అంశాల గురించి వక్తలు వివరించారు రాబోయే రోజుల్లో మజ్దూర్ యూనియన్ జరిపే కార్యక్రమాల గురించి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని ఆలోచన విధానాన్ని యూనియన్ నాయకులు వివరించారు ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి వాటి నిర్వహణ కొరకు ప్రభుత్వమే తగిన చర్యలు తీసుకోవాలని శ్రీ శక్తి పథకం వలన ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్నందున తగినని బస్సులు కొనుగోలు చేసి మరియు సిబ్బంది కొరత లేకుండా చేయాలని పెండింగ్లో ఉన్నటువంటి డిఏలను




ఎన్కాష్మెంటును అలాగే అయ్యారు కూడా ప్రభుత్వం ప్రకటించాలని ఇంకా అనేక అపరిష్కృత డిమాండ్ల పరిష్కారం కొరకు తమ యూనియన్ పోరాటాలు చేస్తుందని తెలిపారు. అనంతరం ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపో మద్దూర్ యూనియన్ నూతన డిపో కమిటీని ఎన్నుకోవడం జరిగింది డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ గా జిఎస్ మనీ ,డిపో ప్రెసిడెంట్ గా రమేష్, సెక్రటరీగా రోశయ్య డిపో కోశాధికారిగా గిరిబాబు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వారందరినీ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఆర్టీసీ కార్మికులు ఘనంగా శాలువాలు పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా డిపో మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘ సభ్యులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై నిత్యం పోరాడుతామని వారు తెలిపారు డిపో మజ్దూర్ యూనియన్ నాయకులుగా తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర జిల్లా జోనల్ మజ్దూర్ యూనియన్ నాయకులఅందరికీ డిపో యూనియన్ కార్మికులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పామగంటి షాలేం రాజు

**జి.ఆనంద్ చైతన్య గంజహాల్లి మహదేవ్ మాదిగ**

- ఉసురుపాటి బ్రహ్మయ్య
- దళిత హక్కుల కోసం పనిచేస్తాం

ఎమ్మిగనూరు. పల్లె వెలుగు జూన్ 13 దళిత హక్కుల సాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు ఈదమూడి గ్రామ ముద్దు బిడ్డ ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో పనిచేస్తామని ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు జి. ఆనంద్ చైతన్య మాదిగ, గంజహాల్లి మహదేవ్ మాదిగలు తెలిపారు. ఈ మేరకు వారు శనివారం పత్తికొండ పట్టణం లో జరిగిన ఎమ్మార్పీఎస్ ఉమ్మడి కర్నూలు జిల్లా కమిటి సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పామ గంటి షాలేం రాజు మాదిగ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా “పామగంటి షాలేం రాజు మాదిగ” ని శాలువా,పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎమ్మార్పీఎస్ బలోపేతమునకు తీసుకోవాల్సిన కార్యచరణ పై సుదీర్ఘంగా చర్చించారు. దళిత క్రైస్తవులకు ఎస్సి హోదా కల్పించేందుకు ఎమ్మార్పీఎస్ నేతృత్వంలో గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటాలు ఉధృతం చేయాలని, కలిసి వచ్చే వ్యక్తులతోను,శక్తులతోనూ ఐక్య ఉద్యమాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. 1994 జులై 7న







ప్రకాశం జిల్లా ఈదముడి గ్రామంలో ఏర్పాటైన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావంలో 20 మంది వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన “ఉసురు పాటి బ్రహ్మయ్య మాదిగ” నాయకత్వంలో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో మాదిగలు ఇతర ఉప కులాలు ప్రజలు బ్రహ్మయ్య మాదిగ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. ఈ ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాం కొండ వెంకటేశ్వర్లు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బురుజుల పులికొండ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బి.నరసింహులు మాదిగ, చిన్న ఆంజనేయులు మాదిగ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పామగంటి షాలేమ్ రాజు మాదిగను ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎంఆర్పిఎస్ మహిళా అధ్యక్షురాలు హెచ్. కైరవాడి మరియమ్మ మాదిగ, నందవరం మండలం హాల హర్వి గ్రామానికి చెందిన బూదూరు ప్రకాశం మాదిగ, గొనెగండ్ల మండలం, గోనేగండ్ల కు చెందిన మాదిగ యువ సేన నాయకులు గుల్ల మరుసు తాయన్న మాదిగ, గుల్ల మరుసు చంటి మాదిగ, పెద్దకడబూరు మండలం, కంబలదిన్నె గ్రామానికి చెందిన జయరాజు పాల్గొన్నారు



# నేడు మూడు సబ్ స్టేషన్ లకు విద్యుత్ అంతరయం

- ఏ డి ఈ మధు సుదన్ రెడ్డి
- రూరల్ ఏ ఈ శ్రీనివాసులు





పల్లె వెలుగు బేతంచెర్ల ప్రతినిధి ( జూన్ 13 ):-- డోన్ 132 కేవీ పరిధిలోని 33 కెవి చిన్నమల్కాపురం ఫీడర్ మరమ్మతులు కారణనంగా చిన్నమల్కాపురం , రంగాపురం, గుంటుపల్లి సబ్ స్టేషన్ లకు నేడు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏ డి ఈ మధు సుదన్ రెడ్డి మరియు రూరల్ ఏ ఈ శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటన లో తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... అలాగే రైతులకు ఇచ్చే త్రి ఫేస్ కరెంటు తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మరియు 8:30 నుంచి మధ్యాహ్నం 2:30 వరకు వరకు ఇవ్వడం జరుగుతుందని అలాగే ఈ మూడు సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వారు తెలియజేశారు. కాబట్టి రైతు లు, విద్యుత్ వినియోగదారులు, ఫ్యాక్టరీ యజమానులు సహకరించాల్సిందిగా వారు కోరారు.

# ఘనంగా పంట వంశీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు



బూజనూరు గ్రామంలో శనివారం టిడిపి యువ నాయకులు పంట వంశీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. బూజునూరు గ్రామంలో టిడిపి యువ నాయకుడు మరియు ప్రముఖ వ్యాపారవేత్త పంట వంశీధర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆయన స్వగ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు పంట దిలీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంట వంశీధర్ రెడ్డికి గ్రామంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పంట దిలీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పంట వంశీధర్ రెడ్డి నూరేళ్లు ఆయురారోగ్యాలతో సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. బూజనూరు టీడీపీ నాయకులు పంట మద్దిలేటి రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ వంశీధర్ రెడ్డి అన్నకి జన్మదిన శుభాకాంక్షలు అని, పంట వంశీధర్ రెడ్డి అన్న లక్ష్యం బూజనూరు గ్రామ అభివృద్ధి అని, రానున్న కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి ప్రజలకు చూపిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బూజనూరు టిడిపి నాయకులు పంట రామచంద్రారెడ్డి, వెంకటరామిరెడ్డి, బూజునూరు గ్రంధి వేముల టిడిపి కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైఎస్ఆర్పి కార్యకర్తలను చికిత్స పొందుతున్న పరామర్శించిన

**జిల్లా కార్యదర్శి వై ,ప్రదీప్ రెడ్డి**



ఎమ్మిగనూరు పల్లె వెలుగు జూన్ 13 వైఎస్ఆర్సిపి శ్రేణులపై నిన్న టిడిపి మూకల దాడి లో గాయపడ్డ వైఎస్ఆర్సిపి కార్యకర్తలను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పూజారి ఈరన్న,గొల్ల ఆంజనప్ప,గొల్ల రాముడు లను ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి ఆదేశాల మేరకు పరామర్శించిన జిల్లా ఉపాధ్యక్షులు వారు. కుటుంబ సభ్యులకు రాంపురం రెడ్డి సోదరుల కుటుంబం ఎప్పటికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రతి కుటుంవానికి టాబ్లెట్ ఖర్చుల నిమిత్తం 15000రూ అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం అందజేయాలని వైద్యులను కోరిన యువ నాయకులు వై ప్రదీప్ రెడ్డి జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ రెడ్డి ,అడ్వకేట్ లక్ష్మీనారాయణ రెడ్డి అన్న ,బూదూరు మల్లికార్జున రెడ్డి నర్సారెడ్డి ,నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఐఐటీలో సీటు సాధించిన రామానుజన్ హైస్కూల్ విద్యార్థి



భువనగిరి ఇటీవల ప్రకటించిన జేఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాలలో వడపర్తి గ్రామంలోని శ్రీనివాస రామానుజన్ హైస్కూల్ విద్యార్థి తేజావత్ అఖిల్ నాయకి ఆల్ ఇండియా ర్యాంక్ 1122తో కేరళ రాష్ట్రంలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పాలక్కాడ్ లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో సీటు సాధించారు. అఖిల్ నాయక్ వడపర్తి గ్రామంలోని శ్రీనివాస్ సార్ రామానుజన్ హైస్కూల్లో నర్సరీ నుండి పదవ తరగతి వరకు విద్యను అభ్యసించి, పదవ తరగతిలో స్కూల్ టాపర్గా అట్లాగే ఇంటర్మీడియట్ ఫలితాలలో ఎంపీసీ విభాగంలో 983 మార్కులు సాధించి ఐఐటి అడ్వాన్స్ లో 1122 ర్యాంకు సాధించడం అభినందనీయం. ఇది తన ప్రతిభకు నిదర్శనం ఈ సందర్భంగా అతన్ని పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అట్లాగే గ్రామ( మొండికుంట తండా ) పెద్దలు గ్రామీణ విద్యార్థి ఎస్సార్ స్కూల్లో చదవడం వల్లే ఈ ఘనత సాధించాడని అభినందించారు.

## అధిక లోడుతో లారీలు, తెగిపడుతున్న విద్యుత్ తీగలు



కాట్రేనికోన,పల్లె వెలుగు శనివారం జూన్ 13 :- కాట్రేనికోన మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల గుండా అధిక లోడుతో వెళ్తున్న వాహనాల వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్ణీత పరిమితికి మించి సరుకును రవాణా చేస్తున్న భారీ వాహనాలు రహదారిపై ఉన్న విద్యుత్ తీగలను, ఇంటర్నెట్ కేబుళ్లను ఢీకొంటున్నాయి. ఈ ప్రమాదాల కారణంగా తరచూ విద్యుత్ తీగలు తెగిపడుతూ అపాయకరంగా మారుతున్నాయి. భారీ వాహనాల రాకపోకలతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పాటు, బాటసారులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో ప్రయాణిస్తున్న వాహనాలపై రవాణా శాఖ అధికారులు, స్థానిక పోలీసులు ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు. రహదారుల వెంట నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తద్వారా రాకపోకలకు ఆటంకం కలగకుండా చూడాలని ప్రజలు మరియు వాహనదారులు కోరుతున్నారు. భవిష్యత్తులో విద్యుత్ తీగలు తెగిపడి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరగకముందే అధికారులు మేల్కోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు

## హెచ్ఐవి బాధితులకు రక్షణగా ఎయిడ్స్ నివారణ చట్టం

తాళ్ళరేవు,పల్లె వెలుగు శనివారం జూన్ 13 :- స్థానిక బీమాభాయి మహిళా మండలి కేంద్ర కార్యాలయంలో శనివారం హెచ్ఐవి మరియు ఎయిడ్స్ నివారణ మరియు



నియంత్రణ చట్టం 2017పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సామర్లకోట మరియు ఐపోలవరం మండలాల అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో బీమాభాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ హెచ్ఐవి మరియు ఎయిడ్స్ బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు ఈ చట్టం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వ్యాధిగ్రస్తులను లేదా వారి కుటుంబ సభ్యులను నిందలకు, వివక్షకు గురిచేయడం చట్టరీత్యా నేరమని, వారి పట్ల సానుభూతితో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాది ఝాన్సీ పాల్గొని చట్టంలోని వివిధ అంశాలను వివరించారు. బాధితుల హక్కులను కాపాడటంలో చట్టం పాత్ర గురించి అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీమాభాయి మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు

## అటవీ శాఖ ఆధ్వర్యంలో కోరింగలో ఉచిత కంటి వైద్య శిబిరం

తాళ్లరేవు,పల్లె వెలుగుశనివారం జూన్ 13 :- కాకినాడ జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో కోరింగ ఫారెస్ట్ కాంప్లెక్స్ నందు శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.



ఏఎల్ఐ ఫౌండేషన్ మరియు సూర్య కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 20 పర్యావరణ అభివృద్ధి కమిటీల పరిధిలోని గ్రామస్తులకు కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో కోరింగ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, ఫారెస్ట్ సిబ్బంది, సూర్య కంటి ఆసుపత్రి వైద్యులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో సుమారు వందల మందికి పైగా గ్రామస్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి లోపాలను గుర్తించారు. అవసరమైన వారికి కళ్ళజోళ్ళను ఉచితంగా అందజేయడమే కాకుండా, శస్త్రచికిత్స అవసరమైన వారిని గుర్తించి సూర్య కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు. అడవులపై ఆధారపడి జీవించే పర్యావరణ అభివృద్ధి కమిటీల సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని రేంజ్ అధికారి ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ తెలిపారు. అటవీ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో మరిన్ని వైద్య సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య బృందానికి, ఏఎల్ఐ ఫౌండేషన్ ప్రతినిధులకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు

## మాజీ సర్పంచ్ గ్రంధి సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని పరామర్శించిన పోతుల మోహనరావు



గండేపల్లి,పల్లె వెలుగు శనివారం జూన్ 13 :- గండేపల్లి మండలం మల్లేపల్లి మాజీ సర్పంచ్ గ్రంధి సుబ్రహ్మణ్యం భార్య మహాలక్ష్మి ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు గండేపల్లి మండల టిడిపి అధ్యక్షుడు పోతుల మోహనరావు శనివారం మల్లేపల్లిలోని సుబ్రహ్మణ్యం నివాసానికి వెళ్లారు. అక్కడ మహాలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంధి సుబ్రహ్మణ్యం, వారి కుమారులు మల్లేపల్లి సొసైటీ మాజీ చైర్మన్ గ్రంధి నాగబాబు, గ్రంధి సత్తిబాబులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాటేపల్లి భద్రం, కొల్లు త్రిమూర్తులు, తలారిబాబురావు, తణుకు దుర్గారావు, పొంతపల్లి రామయ్య, బదిరెడ్డి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు

## రక్తదాత విఆర్ఎన్.బి ప్రసాద్‌కు సన్మానించిన కలెక్టర్, హరింద్ర ప్రసాద్



కాకినాడ,(పల్లె వెలుగు) శనివారం జూన్ 13 :- ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్తదాన రంగంలో విశేష సేవలందిస్తున్న వి ఆర్ ఎన్ బి ప్రసాద్‌ను జిల్లా యంత్రాంగం సత్కరించింది. కాకినాడ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరింద్ర ప్రసాద్ మరియు రెడ్ క్రాస్ చైర్మన్ వై డి రామారావు ఆయనను దుశ్శాలువతో సన్మానించి, ప్రత్యేక మెమెంటోను బహూకరించారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి మల్లవరం గ్రామానికి చెందిన వి ఆర్ ఎన్ బి ప్రసాద్, సమాజహిత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతి ఏటా సెప్టెంబర్ 2వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మరియు చిరంజీవి జన్మదినోత్సవం సందర్భంగా, ప్రసాద్ ఆధ్వర్యంలో పి మల్లవరంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల ద్వారా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం 150 యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించి రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకుకు అందజేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అత్యవసర సమయాల్లో రోగులకు అవసరమైన రక్తదాతలను సమకూర్చడంలో నిరంతరం ముందుంటున్న ప్రసాద్ సేవలను కలెక్టర్ ఎం ఎన్ హరింద్ర ప్రసాద్ మరియు వై డి రామారావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు

## బూత్ స్థాయి కమిటీలే పార్టీకి వెన్నెముక, జగ్గంపేటలో టిడిపి శిక్షణా తరగతులు



జగ్గంపేట,పల్లె వెలుగు శనివారం జూన్ 13 :- జగ్గంపేట మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం క్లస్టర్, కో-క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు మరియు బిఎల్ఎల కోసం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. మండల అధ్యక్షులు జీనుమణి బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు ఎస్ వి ఎస్ అప్పలరాజు, కుంచె రాజా, కందుల చిట్టిబాబు, రేఖ బుల్లి రాజు, బొల్లారెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి బూత్ ఏజెంట్ క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదయ్యేలా చూడాలని పరిశీలకులు దిశానిర్దేశం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, డూప్లికేట్ ఓట్ల గుర్తింపు మరియు మరణించిన వారి ఓట్ల తొలగింపు ప్రక్రియపై కమిటీలకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీనుమణి బాబు మాట్లాడుతూ బూత్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉన్నప్పుడే ప్రజాతీర్పు సక్రమంగా ఉంటుందని, 18 ఏళ్లు నిండిన ప్రతి యువతను ఓటరుగా నమోదు చేయించడం పార్టీ బలోపేతానికి తొలిమెట్టు అని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా రాజ్యాంగ వ్యవస్థను గౌరవిస్తూ ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిక్షణలో పైడిపాల సూరిబాబు, బుర్రి సత్తిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, పాండ్రంగి రాంబాబు, వేములకొండ జోగారావు, ముంద్రు ఎర్రబాబు, మూసిరెడ్డి నాగేశ్వరరావు, గెద్దాడ సత్యవేణి, పిలా మహేష్, నండ్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు

## దివాన్‌చెరువులో ఎస్.సి మోర్చా ఆధ్వర్యంలో ప్రగతి పాదయాత్ర




దివాన్‌చెరువు,(పల్లె వెలుగు శనివారం జూన్ 13 :- రాజానగరం మండలం దివాన్‌చెరువులో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జాతీయ రహదారి అభివృద్ధి పనులను బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రగతి పాదయాత్రలో భాగంగా పరిశీలించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్ ఆదేశాల మేరకు, తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు తగరం సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర హాజరయ్యారు. జాతీయ రహదారి అభివృద్ధి పనులను పరిశీలించిన వారు, దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరుగుతున్న రహదారుల విస్తరణ ద్వారా రవాణా వ్యవస్థ మెరుగుపడటంతో పాటు ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు లభిస్తాయని వారు వివరించారు. కేంద్రం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించడమే ఈ పాదయాత్ర ప్రధాన ఉద్దేశమని నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అళ్ల శివ, సేతు మాధవ్, యజ్జల శ్రీనివాస్, బట్టు రమేష్, కాటూరి యేసు, అర్దాల కుమార్, దుర్గాప్రసాద్, కృష్ణ, మోహిని, పోలవరపు రాము, కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి ఆలయానికి రూ. 31.58 లక్షల ఆదాయం



మందపల్లి,(పల్లె వెలుగు శనివారం జూన్ 13 :- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలోని శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనిత్రయోదశి సందర్భంగా శనివారం భక్తులు పోటెత్తారు. ఈ పర్వదినం సందర్భంగా స్వామి వారికి నిర్వహించిన ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలతో ఆలయానికి భారీగా ఆదాయం సమకూరిందని దేవస్థాన సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు వెల్లడించారు. శనిత్రయోదశి ప్రత్యేక పూజల్లో భాగంగా ముఖమండపం దర్శనాల ద్వారా రూ. 12,24,300, తైలాభిషేకాల ద్వారా రూ. 6,06,750, తైలం సమర్పించి దర్శనం చేసుకున్న వారి ద్వారా రూ. 1,21,200 ఆదాయం లభించింది. వీటితో పాటు పిఒఎస్ (ఫోన్ పే) ద్వారా రూ. 2,95,880 ఆదాయం సమకూరింది. పరోక్ష పూజల ద్వారా రూ. 8,63,800, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ. 46,646 అందాయని, తద్వారా మొత్తం రూ. 31,58,576 ఆదాయం వచ్చిందని కార్యనిర్వహణాధికారి తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు

## మందపల్లిలో శనిత్రయోదశి సందర్భంగా, దర్శించుకున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

మందపల్లి,పల్లె వెలుగు శనివారం జూన్ 13 :- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మందపల్లిలోని శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానంలో శనిత్రయోదశి పర్వదినం సందర్భంగా భక్తులు పోటెత్తారు. కొత్తపేట శాసన



సభ్యుల సూచనలు, ధర్మకర్తల మండలి సభ్యుల సలహాల మేరకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ఆలయం వెనుక భాగంలో గోదావరి పుష్కర నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో, భక్తుల కోసం హై స్కూల్ గ్రౌండ్‌లో రూ. 250 మరియు ఆలయ ప్రాంగణంలో రూ. 700 విలువైన తైలాభిషేక టికెట్లను అందుబాటులో ఉంచారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, క్లాత్ పెండల్స్, టెంట్లు, మజ్జిగ చలివేంద్రాలు, బిస్కెట్లు, పాలు, అన్నప్రసాదం, ఉచిత ఆటో సర్వీసులు, షవర్ బాత్ లు, డిస్ప్లే బోర్డులు మరియు సమాచార కేంద్రాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల నుండే దర్శనాలకు అనుమతించగా, ధర్మకర్తల మండలి సభ్యులు మరియు పోలీసు శాఖ సమన్వయంతో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు రెడ్డి సుబ్రహ్మణ్యం ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. దేవస్థానం సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం వేద పండితులు ఆశీర్వచనం అందించి, స్వామి వారి వస్త్రం, తీర్థ ప్రసాదాలను సమర్పించారు

## ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక శోభ



ర్యాలి,పల్లె వెలుగు శనివారం జూన్ 13 :- డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట నియోజకవర్గం ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వెలసిన శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి దేవస్థానంలో శనివారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పర్వదినం సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం వారు చేపట్టిన నిత్యాన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అదేవిధంగా ర్యాలి గ్రామంలోని శ్రీ జగన్మోహిని కేశవ మరియు గోపాల స్వామి వారి దేవస్థానంలో స్థానిక భక్తులు, లలితా పారాయణదారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లలితా సహస్రనామ, మణిద్వీప పారాయణలతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో మార్మోగింది. ఈ పారాయణ కార్యక్రమాల్లో ర్యాలి గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ అధికారుల పర్యవేక్షణలో నిత్య పూజా కార్యక్రమాలు మరియు అన్నదాన కార్యక్రమాలు క్రమపద్ధతిలో పూర్తి స్థాయిలో సాగాయి

# దేనికైనా సిద్ధం ఎమ్మెల్యే బుడ్డా



## శిల్పాకు ఎమ్మెల్యే బుడ్డా బహిరంగ సవాల్

**బండి ఆత్మకూరు పల్లె వెలుగు జూన్ 13:** రెండేళ్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనలో ప్రజలకు ఏమి చేయలేదంట! దీన్నే పట్టుకొని వైఎస్ఆర్ పార్టీ నాయకులు రోడ్లు ఎక్కుతున్నారు. విమర్శలు చేస్తున్నారు. సిగ్గుందా! ఈ దరిద్రులకు అంటూ బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆవేశంగా మాట్లాడారు. వైయస్సార్ పార్టీ వారికి సంబంధించి తల్లికి వందనం నిధులు పడలేదా? రైతు భరోసా పడలేదా? లేక వైఎస్ఆర్ పార్టీకి సంబంధించిన మహిళలకు బస్సులలో ప్రయాణం చేయవద్దని మేమేమన్నా చెప్పామా అంటూ ప్రశ్నించారు. రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి అప్పుడప్పుడు నియోజకవర్గానికి రావడం, శిల్పాకు అలవాటుగా మారింది అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు బ్రహ్మాండంగా జరుగుతూ ఉన్నాయి. ప్రజా సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తూ ఉన్నాము. ఇంకా చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. వాటికి కూడా ప్రణాళికలు తయారు చేసుకొని ముందుకు వెళ్లే ప్రయత్నాలను చేసుకుంటున్నామని బుడ్డా పేర్కొన్నారు. తమ వ్యక్తిగత పనులను చేసుకోవడం కోసం ప్రజలను ఏదో ఒక రకంగా మభ్యపెట్టి పోవడం శిల్పా కు చెల్లుబాటు అవుతుందని, ప్రజలకు పంగనామాలు పెట్టి పోవడమే వీరికో అలవాటు అని బుడ్డా విమర్శించారు. ప్రజలు మంచి చెడు గురించి ఆలోచన చేయాలని బుడ్డా హితవు పలికారు. గత ఐదు సంవత్సరాల వైయస్సార్ పరిపాలనలో మీ కార్యకర్తలే విసిగిపోయారు కాబట్టి, వారు కూడా మాకు ఓట్లు వేశారు కాబట్టి 164 సీట్లతో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం జరిగిందని అన్నారు. సున్నిపెంట గ్రామంలో ఇళ్ల పట్టాల విషయంలో ఇష్టానుసారంగా నోటికి ఏది వస్తే అది మాట్లాడటం, వాడు వీడు అంటూ సంబోధించడం శిల్పాకు అలవాటుగా మారిందని అన్నారు. సుని పెంటలో నీవు ఇష్టం వచ్చినట్లు, నీ నోటికి అడ్డు అదుపు లేకుండా మాట్లాడినందుకు నేను కొన్ని పదాలను వాడాల్సి వచ్చిందని బుడ్డా గుర్తు చేశారు. అది కూడా సుని పెంట జరిగిందని అన్నారు. సుని పెంట ప్రశాంతంగా ఉందని బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తున్నామని, నియోజకవర్గంలో పాటు సున్నిపెంట గ్రామం వైపు ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులను చేస్తున్నామని అన్నారు. అదిగాక సున్నిపెంట ప్రత్యేక గ్రామం కాబట్టి, ప్రత్యేకంగా నిధులు తీసుకుని వచ్చి పనులు చేయడం జరుగుతూ ఉందని అన్నారు. ఈ విషయాన్ని గుర్తించగా వైఎస్ఆర్ పార్టీ సానుభూతిపరులు నాయకులు ఫోటోలో కేసులు వేయించి ప్రజల్లో భయాందోళనలను సృష్టిస్తున్నారని, మళ్లీ వారే సమర్థించుకుంటున్నారని బుడ్డా విమర్శించారు. బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి ఎవరూ లేరని విమర్శిస్తున్నారని, పార్టీ కార్యకర్తలే నా కుటుంబ సభ్యులు అని, నీకు మీ అన్నదమ్ములు మీ చిన్నాయన కొడుకులే కుటుంబ సభ్యులైతే, నియోజవర్గంలోని ప్రతి గ్రామంలోని కార్యకర్తలందరూ నా కుటుంబ సభ్యులే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. నీకు ఎన్నోసార్లు చెప్పాను, ఎన్నోసార్లు సవాలు విసిరాను. నీకు దమ్ము ధైర్యం ఉంటే నువ్వే చేయి చెప్పు. నీకు ఇష్టం ఉన్న మీడియాను పిలుచుకొని రా! నియోజకవర్గంలో మరోసారి శిల్పపై సవాల్ విసిరారు. ఐదు సంవత్సరాల నీ పరిపాలనలో శ్రీశైలం నియోజకవర్గం ప్రజలు నిన్ను ఎన్నుకున్నందుకు ఒక్క శాశ్వతమైన పని ఏదైనా చేశావో చెప్పు అంటూ విమర్శలు చేశారు. మాట్లాడితే సచివాలయం కట్టినామని అంటావు. మీరు కట్టిన సచివాలయాలు చాలా సగంలోనే ఉన్నాయి. రైతుల కోసం మీరు కట్టించిన గోదాములలో రైతులు ఒక బస్తా ధాన్యం కూడా వేసుకునేందుకు దిక్కులేని పరిస్థితుల్లో ఉన్నాయి అని అన్నారు. డబ్బులు ఉన్నాయని అహంకారంతో విర్రవీగుతున్నావు. నాలుగున్నర సంవత్సరాలు నేను నియోజకవర్గ వదిలి పారిపోయానంటూ విమర్శలు చేస్తున్నావని అంటున్నావు. తాను అధికారంలో ఉన్న లేకపోయినా ప్రజల మధ్యనే ఉంటాను అన్న విషయాన్ని నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునని అన్నారు. రాజకీయాలలో విమర్శలు చేసుకోవొచ్చునని, అయితే దానికి ఒక పద్ధతి అంటూ ఉండాలని అన్నారు. మాట్లాడితే మా చిన్నాయన మా పెద్దనాన్న మాట్లాడుతావు. నాకు కూడా వైయస్సార్ పార్టీ కార్యకర్తలు ఉన్నారని ఏనాడైనా శిల్ప చెప్పారా అంటూ బుడ్డా ప్రజలకు అవసరమైన సబ్జెక్టు గురించే మాట్లాడడం నువ్వేం చేసావో నేనేం చేశాను చెప్తా అంటూ అన్నారు. నీ ఇంటి మీదికి వచ్చినప్పుడు వీళ్లంతా ఏమయ్యారని బుడ్డా ప్రశ్నించారు. శిల్పా చేష్టలు తెలియక చాలామంది వీళ్ల మాటలకు ప్రలోభ పడి ఓట్లేస్తున్నారని, అన్నారు. పార్టీని చూసి కాదు, బుడ్డా ను చూసే ఓట్లు వేసే ప్రజలు చాలామంది నా నియోజకవర్గంలో ఉన్నారని అన్నారు. కార్యకర్తలంతా ఇకనుంచి సిద్ధంగా ఉండాలని, అయితే మీరు మాత్రం ఎలాంటి తప్పులు చేయవద్దని కార్యకర్తలను హెచ్చరించారు. వైయస్సార్ పార్టీ వారి తప్పులు దొరుకుతే మాత్రం ఎవరిని వదల వద్దని, భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీ వారిని చూస్తే భయపడి పోవాలని అన్నారు. ఎందుకులే అని ఇన్నాళ్లు మౌనం వహించానని, ఇకనుండి ఎలాంటి విషయంలోనూ ఉపేక్షించేది లేదని, చూస్తావు బిడ్డా! బుడ్డా అంటే ఏమిటో! అంటూ శిల్పాను బుడ్డా రాజశేఖర్ రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు.



# రఘుదేవపురం జనసేనా పార్టీ నాయకుడే దారి నిర్బంధించాడు




సీతానగరం,పల్లె వెలుగు శనివారం జూన్ 13 :- తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలంలో రఘుదేవపురం గ్రామంలో జనసేన పార్టీ నాయకులు పలు వివాదాల్లో చిక్కుకుంటున్నారనే ఆరోపణలు వరుసగా వెల్లువెత్తుతున్నాయి. నిజానికి జనసేన పార్టీ అంటే నిబద్ధతకు ప్రజా సేవకు నిదర్శనమని నియోజకవర్గ జనసేనా పార్టీ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పలు సందర్భాల్లో చెప్పుకొచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అయితే ఆ పార్టీ నాయకుల అత్యుత్సాహం వలన రఘుదేవపురం గ్రామంలో జనసేన పార్టీలో జరుగుతున్న పరిణామాల వలన రాబోయే స్థానిక ఎన్నికల్లో మండలంలో జనసేన పార్టీ నాయకులకు దక్కే పదవులపై విజయం సాధిస్తారా అనే అంశంపై ప్రశ్నార్థకంగా మారిందని పలువురు అంటున్నారు. స్థానిక ఎన్నికలు దగ్గర పడుతున్నా ఈ గ్రామ నాయకులలో మాత్రం మార్పు కనిపించడం లేదని ప్రజల నుండి గుసగుసలు వినబడుతున్నాయి. ఎమ్మెల్యే స్పందించి గాడి తప్పుకున్న వారిని సక్రమంగా నడిపిస్తూ అచ్యుత్సాహాన్ని ప్రదర్శించే నాయకులకు అర్థమయ్యే రీతిలో చెపుతూ ఒకటికి రెండుసార్లు పరిశీలించి ఇలాంటి వారిపై తగిన విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే వచ్చే స్థానిక,రాబోయే ఎన్నికల్లో పార్టీ పరిస్థితి ఇబ్బందుల్లో పడక తప్పదని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. విషయాన్ని పూర్తిస్థాయిలో పరిశీలనలోకి తీసుకున్న ఎమ్మెల్యే మరి ఏం చేస్తారనేది చూడాలని రఘుదేవపురం గ్రామ కూటమి నాయకులు అంటున్నారు. ఇక్కడ చిత్రం ఏంటంటే పనిచేస్తున్న నాయకుల కంటే కూడా ఇలాంటి చోటా నాయకులకే పార్టీలో ప్రాధాన్యం దక్కుతోందన్నది మరో ప్రధాన విమర్శ కూడా లేకపోలేదు. వివరాల్లోకి వెళితే రఘుదేవపురం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు మావిడాల సుబ్రహ్మణ్యం అతని భావ అడపా రాజు అనువారు దౌర్జన్యంగా వినాయకుడి గుడి సమీపంలో పంచాయతీ రోడ్డును సైతం ఆక్రమించుకొని కంచె నిర్మించారని బాధితులు గుర్రాల దుర్గాప్రసాద్ అతని తల్లి గుర్రాల పోసమ్మ ఆరోపించారు. ఈ సందర్భంగా గుర్రాల దుర్గాప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ గతంలో స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పోటీ చేసినప్పుడు మేము కూడా కార్యకర్తలుగా పని చేసామని నేటి ఎమ్మెల్యే బలరామకృష్ణ గెలుపు రాకుండానే ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని దాంతో మండల ప్రజలు ఇలాంటి నాయకుడు కావాలని అందరూ ఆశ పడటంతో ఎమ్మెల్యే సీటు సాధించిన తర్వాత ఏ నాయకుడూ చేయలేని అభివృద్ధి కార్యక్రమాలు బలరామకృష్ణ చేశారని గ్రామంలో ఉన్న జన సైనికులంతా ఆనందం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో మా గ్రామంలో ఉన్న మావిడాల సుబ్బు అనే వ్యక్తి వలన మాకు రాబోయే రోజుల్లో నిలువ నీడ లేకుండా పోతుందని మా వీధిలోని ఉన్న వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. నాయకుడంటే పదిమందికి ఆదర్శంగా నిలబడాలే తప్ప పదిమందిని పాడు చేయాలని చూస్తున్న నాయకుడి స్థానం మావిడాల సుబ్బుకే దక్కిందని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నానని దుర్గాప్రసాద్ అన్నారు. ప్రజాధనంతో అప్పట్లో నిర్మించిన సిసి రోడ్లను సైతం ఐదు అడుగులమేర బద్దలు కొట్టి దారి రోడ్డును సైతం ఆక్రమించుకుని జనసేన పార్టీ నాయకుడు అని చెప్పుకొనుచున్న మామిడాల సుబ్బు అతని బావ అడపా రాజు ప్రజలపై దౌర్జన్యానికి దిగుతున్నారని వాపోయారు. నేను నా కుటుంబ సభ్యులు తూర్పు దిశగా వీధిలోకి వెళ్లాలంటే రోడ్డును పూర్తిగా నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేమి అన్యాయమని అడిగితే పార్టీ మాది ఎమ్మెల్యే మా మనిషి మేమెంత చెబితే అంతా అని పచ్చి దుర్భాషలాడుతున్నారని అన్నారు. ఇటీవల కాలంలో వైసిపి పార్టీ నుండి జనసేన పార్టీలోకి వచ్చిన గెద్దాడ త్రిమూర్తులు సిసి రోడ్డును సైతం బద్దలు కొట్టి ఆక్రమించుకోమని చెప్పడం ఎంతవరకు సమన్యసం అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మాకు తూర్పు దిశగా ఎలాంటి దారి లేకుండా జనసేన పార్టీలో నాయకుడుగా ఉంటున్న మావిడాల సుబ్రహ్మణ్యం అతని భావరాజు మాత్రమే వెళ్లేందుకు దారిని నిర్మించుకున్నారని మమ్ములను నిర్బంధించారని మా సమస్యపై జిల్లా అధికారులు మండలాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని కోరుతున్నామని వారు అన్నారు. గత 30 సంవత్సరాల క్రితం మేము ఇంటి స్థలాన్ని కొనుక్కొని ఇల్లు నిర్మించుకుని ఇక్కడ జీవిస్తున్నామని ఇక్కడ ఉండనివ్వను, బ్రతకనివ్వను అంటూ జనసేనా పార్టీకి చెందిన మామిడాల సుబ్రహ్మణ్యం బెదిరింపులకు గురి చేస్తున్నాడని గుర్రాల దుర్గాప్రసాద్,అతని తల్లి పోసమ్మ తెలిపారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉండవలసిన వాడే కాలేయముడై మమ్మల్ని ఆవేదనకు గురి చేస్తున్నాడని ఇక్కడ స్వేచ్ఛగా జీవించేందుకు రాజనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బలరామకృష్ణ మాకు గతంలో ఎంతగానో సహకారం చేశారని,ఇప్పుడు ఈ మామిడాల సుబ్బు వలన మాకు నిలువ నీడ లేకుండా పోతుందేమోనని భయంగా ఉందని స్థానికులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఏది ఏమైనా ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు స్వేచ్ఛగా ఉండేందుకు తగిన సహాయ సహకారాలు అందించాలని స్థానికులు ఎమ్మెల్యేను,మండల అధికారులను కోరుతున్నారు

# అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు, కుశాల్‌ను అభినందించిన విప్ ఎమ్మెల్యే దాట్ల



ముమ్మిడివరం,పల్లె వెలుగు శనివారం జూన్ 13 :- అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి ప్రతిభ చాటిన చిన్నారి విత్తనాల కుశాల్ నాగ వెంకట్‌ను ముమ్మిడివరం ఎమ్మెల్యే మరియు శాసనసభ విప్ దాట్ల సుబ్బరాజు అభినందించారు. కాట్రేనికోన గ్రామానికి చెందిన 8 ఏళ్ల కుశాల్ నాగ వెంకట్, అమలాపురంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మూడవ తరగతి చదువుతున్నాడు. ఈ బాలుడు 1 నుండి 80 వరకు వర్గ సంఖ్యల విలువలను కేవలం 1 నిమిషం 29 సెకన్ల 33 మిల్లీ సెకన్లలోనే చెప్పి ఈ అరుదైన ఘనతను సాధించాడు. ఇప్పటికే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన కుశాల్, తాజాగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు హర్షం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కనబరిచిన ఈ బాలుడు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మరియు దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన కుశాల్ నాగ వెంకట్‌తో పాటు అతని తల్లిదండ్రులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు

# జేగురుపాడులో కార్డన్ అండ్ సెర్చ్, 12 ద్విచక్ర వాహనాలు, మద్యం సీసాల స్వాధీనం

కడియం,పల్లె వెలుగు శనివారం జూన్ 13 :- తూర్పు గోదావరి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కడియం మండలం జేగురుపాడు గ్రామం పాముల మెట్ట కాలనీలో శనివారం తెల్లవారుజామున విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, కడియం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ. వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని పలు ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు, సరైన రికార్డులు లేని 12 మోటార్ సైకిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.



అదేవిధంగా అక్రమంగా నిర్వహిస్తున్న ఒక బెల్ట్ షాపుపై దాడి చేసి 35 క్వార్టర్ మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో బాధ్యులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాలనీలో కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించిన అధికారులు, సమాజంలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగ దుర్గా ప్రసాద్, ఈగల్ టీమ్ సిబ్బంది మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం చేపట్టిన ఈ చర్యలను స్థానికులు అభినందించారు

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com